13. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 276 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అశోక్ ముస్తాపురే

హైదరాబాద్ వెలుతురు మార్చి 12:

బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆదిలాబాద్ జిల్లా నుంచి అశోక్ ముస్తాపురే ను రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు నియమించారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులకు అశోక్ ముస్తాపురే హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా పార్టీ పెద్దలు కేంద్ర మంత్రి వర్యులు శ్రీ కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీ గోడెం నాగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారీ తో పాటు పార్టీ పెద్దలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తరపున ప్రజల సమస్యలపై గళం వినిపిస్తూ, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన ఈ బాధ్యతను పూర్తి స్థాయిలో నెరవేర్చేందుకు కట్టుబడి ఉంటానని అశోక్ ముస్తాపురే తెలిపారు.



## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

- గవర్నర్ శుక్లా దంపతులకు ఘన స్వాగతం
- దర్శనం చేయించి, వేదాశీర్వచనం ఇచ్చిన పండితులు

యాదాద్రి,మార్చి12 వెలుతురు:

యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని 2లో..

## పేదవాడికి మెరుగైన వైద్యం అందాలి

- మానవత్వంతో కూడిన సేవగా ఉండాలి
- హైదరాబాద్ మెడికోవర్ అస్పత్రి ప్రారంభించిన సిఎం



హైదరాబాద్,మార్చి12( వెలుతురు):

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కేవలం భవన నిర్మాణంతోనే సాధ్యం కాదు, నాణ్యమైన విద్య, వైద్యం సామాన్యుడికి చేరినప్పుడే అసలైన ప్రగతి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'వైద్యం యాంత్రికంగా ఉండకూడదు.. అది మానవత్వంతో కూడిన సేవగా ఉండాలి' అనే నినాదంతో కాంగ్రెస్ సర్కార్ కీలక అడుగులు వేస్తోందని తెలిపారు. హైదరాబాద్ నగరం నేడు 2లో..

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

- ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి,
- ఫ్యూచర్‌సిటీలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన



హైదరాబాద్,మార్చి12 వెలుతురు :

నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ 2లో..

## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే

- అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు

టెహ్రాన్,మార్చి12 వెలుతురు:

ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం 2లో..



# దేశంలో ఇంధన కొరత లేదు

- తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయి
- రిఫనరీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి
- ఎలాంటి సంక్షోభాన్ని అయినా ఎదుర్కొంటాం
- లోక్‌సభలో కేంద్రమంత్రి హర్దీప్ పురి సింగ్ ప్రకటన
- మంత్రిని హేళళన చేస్తూ ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావనతో గందరగోళం



న్యూఢిల్లీ,మార్చి12 వెలుతురు:

పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గురువారం ఎల్‌పీజీ అంశంపై లోక్‌సభలో వాడీవేడి చర్చ జరిగింది. చర్చలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రస్తావన తీసుకురావడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అయితే ఇంధన కొరతపై కేంద్రమంత్రి 8లో..







## ప్రజా సేవలో భాగస్వామ్యం.. భగవంతుడిచ్చిన వరం!

- ప్రజల దీవెనలతోనే ఈ స్థాయికి చేరుకున్నాం
- నిధుల వినియోగంలో నూతన ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి
- శిక్షణ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి 2లో..

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు,
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన,
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి 2లో..

# 40 డిగ్రీల ఎండ.... 40 కి.మీల పాదయాత్ర....

- 8 గంటల్లోనే కరీంనగర్ నుండి కొండగట్టుకు నడిచేలా బండి సంజయ్ ప్రణాళిక
- అంజన్న ఆశీర్వాద యాత్రకు ఏర్పాట్లు సర్వం సిద్ధం
- మేం సైతం..... కొండగట్టుకు వస్తామంటూ రాష్ట్రవ్యాప్తంగా కాషాయ శ్రేణుల ఫోన్లు
- 14న పొద్దున్నే 6 గంటలకు కరీంనగర్ మహాశక్తి ఆలయం వద్దకు చేరుకోనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్
- దారి పొడవునా తాగునీరు, మజ్జిగ, పులిహోర అందించాలని స్వచ్ఛంద సంస్థల నిర్ణయం
- రాజకీయాలకు అతీతంగా కొనసాగే "అంజన్న ఆశీర్వాద యాత్రలో" పాల్గొనేందుకు భక్త మండళ్లు, భక్తులు నిర్ణయం
- 10వ తరగతి పరీక్షలకు ఇబ్బంది లేకుండా క్రమశిక్షణతో పాదయాత్రను సక్సెస్ చేయాలని బండి సంజయ్ విజప్తి

బాజా భజంత్రీలతో.... కనీవినీ ఎరగని రీతిలో సక్సెస్ చేసేందుకు స్థానిక నేతల సన్నాహాలు




కరీంనగర్ వెలుతురు మార్చి 12:

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ "అంజన్న ఆశీర్వాద యాత్ర" పేరిట ఈనెల 14న జరపతలపెట్టిన "మహా పాదయాత్ర"కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కరీంనగర్ లో రేపు 38 నుండి 40 డిగ్రీల సెల్సియస్ మేరకు వాతావరణం వేడి ఉండబోతున్నట్లు వాతావరణ 2లో..

త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమి సాధనలో

## పోలీస్ శాఖ పాత్ర కీలకం

- పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,మార్చి12 వెలుతురు:

2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమి సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో 3లో..

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

- హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక
- క్షేమంగా ముంబై తీరం చేరుకున్నషెన్‌లాంగ్
- ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక



ముంబై,మార్చి12 వెలుతురు:

పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హర్మూజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావరణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే కావడం విశేషం. 2లో..

ఉస్మానియా విశ్వవిద్యాలయం

## తెలంగాణాకు ఐకాన్

- 1000 కోట్లతో అభివృద్ధికీ రూట్ మ్యాప్
- నిధులు మంజూరు చేయడం అభినందనీయం 2లో..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ధన్యవాదాలు




# నీటి వినియోగంలో జాగ్రత్తులు ముఖ్యం

- భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి
- రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం
- జగన్ హయాంలో పెట్టుబడిదారుల పరార్
- జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు
- సంపద సృష్టిస్తేనే మెరుగైన సమాజం సాధ్యం
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు

అమరావతి,మార్చి12 వెలుతురు:

నీటిని సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్ 2లో..



## పేదవాడికి మెరుగైన వైద్యం అందాలి

ప్రపంచ పటంలో నిలవడానికి గత పాలకులు ఎంతో కృషి చేశారు అని అన్నారు. హైదరాబాద్‌లో మెడికవర్ ప్రైవేట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' నేదురుమల్లి జనార్థన్ రెడ్డి, పీవీ నరసింహారావుల సరళీకరణ విధానాలు హైదరాబాద్ అభివృద్ధికి బీజం వేశాయి. ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో హైటెక్ సిటీ పూర్తి కావడంతో నగరం ఐటీ హబ్‌గా రూపాంతరం చెందింది. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం వాటా ఒక్క హైదరాబాద్‌దే కావడం ఎంతో గర్వకారణం. కరోనా సమయంలో ప్రపంచాన్ని కాపాడిన మూడు వ్యాక్సిన్లు మన జినోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి కావడం రాష్ట్రానికి గర్వకారణం' అని అన్నారు.

## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం కోసం గురువారం ఉదయం యాదగిరిగుట్టకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. గవర్నర్ రాక సందర్భంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా ప్రతాప్ శుక్లా చేత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

**హైదరాబాద్,మార్చి12 వెలుతురు:**

పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం




అయితే హర్మూజ్ నుంచి రావడానికి ఇరాన్ పరోక్షంగా సహకరించిందని సమాచారం. హర్మూజ్ అంతరాయాలతో భారత్‌లో ఇంధన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో షెన్‌లాంగ్ విజయవంతంగా దేశానికి చేరడం, మరోవైపు భారత పతాక నౌకలు హర్మూజ్‌నుంచి వెళ్లొచ్చని ఇరాన్ అనుమతిచ్చినట్లు వార్తలు రావడం ఊరటనిస్తోంది. దీనిని నడిపిన కెప్టెన్ కూడా ఇండియనే. లైబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ చమురు ట్యాంకర్ బుధవారం ముంబయి నౌకాశ్రయానికి చేరుకుంది. మూడు రోజుల క్రితమే అది హర్మూజ్ ను దాటింది. తన ప్రయాణాన్ని ఎవరూ ట్రాక్ చేయకుండా చురుగ్గా వ్యవహరించింది. మార్చి ఒకటిన ఈ ట్యాంకర్ సౌదీ అరేబియా పోర్ట్ వద్ద చమురు లోడ్ చేసుకుంది. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. దాని సిగ్నల్స్ మార్చి 8న హర్మూజ్‌లో కనిపించాయి. ఆ తర్వాత అది జాడలేకుండా పోయింది. నౌకలోని సిబ్బంది ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ , ట్రాన్స్‌పాండర్లను స్విచ్ఛాఫ్ చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం అడుగడుగునా ప్రమాదకరంగా మారిన హర్మూజ్‌లో గుర్తింపు తెలియకుండా సిబ్బంది ఈ నిర్ణయం తీసుకున్నారు. జలసంధిని దాటి ఇండియా దిశగా ప్రయాణిస్తున్నప్పుడు.. అంటే ఒకరోజు తర్వాత మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్స్‌లో ఈ షిప్ కనిపించింది. సంక్షోభ సమయాల్లో ప్రత్యర్థులకు చిక్కకుండా ఉండేందుకు అసాధారణ పరిస్థితుల్లో షిప్పింగ్ కంపెనీలు ఈ టెక్నిక్‌ను వాడుతుంటాయి. దీనిని గోయింగ్ డార్క్ గా చెప్తుంటారు. అంతర్జాతీయ సముద్రయాన నిబంధనల ప్రకారం.. భద్రత, రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఏఐఎస్‌ను ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంచాలి. ఇక, ఇప్పుడు ముంబయికు షెన్‌లాంగ్.. 1,35,335 మెట్రిక్ టన్నుల చమురును మోసుకొచ్చింది. గ్రీస్‌లోని డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఈ నౌక కార్యకలాపాలు చూస్తోంది. 29 మంది సిబ్బందిలో భారతీయులతో సహా పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ జాతీయులు ఉన్నారు. కెప్టెన్ సుక్షాంత్ సింగ్ సింధు భారతీయుడే కావడం విశేషం.

## 40 డిగ్రీల ఎండ....

## 40 కి.మీల పాదయాత్ర....

శాఖ చెబుతున్నప్పటికీ.....అవేవీ లెక్క చేయకుండా 8 గంటల్లో ఏకబిగిన 40 కి.మీల మేరకు కాలినడకన కొండగట్టుకు చేరుకునేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. పాదయాత్ర పొడవునా కొండగట్టుకు నడిచే వెళ్లే భక్తులకు ఇబ్బంది లేకుండా మంచి నీళ్లు, మజ్జిగ, పులిహోర సహా అన్ని ఏర్పాట్లు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, భక్త మండళ్లు ముందుకు వచ్చాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాయి. మరోవైపు మేము సైతం అంటూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు కరీంనగర్ బాట పట్టేందుకు సమాయత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా "అంజన్న ఆశీర్వాద యాత్ర" సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఈరోజు (గురువారం) సాయంత్రం కరీంనగర్ లో బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. బీజేపీ సీనియర్ నేత డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల ఇంఛార్జీ భండారి శాంతికుమార్, మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పాదయాత్ర జరిగే ప్రాంతాల్లో పర్యటించారు. కొండగట్టు వద్దకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. మరోవైపు "అంజన్న ఆశీర్వాద యాత్ర"కు స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కరీంనగర్ నుండి కొండగట్టు వరకు అడగడుగునా బండి సంజయ్ కు మంగళహారతులు, పూల జల్లులు, వీర తిలకంతో స్వాగతం పలికేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు, మహిళలు, కాషాయ సైనికులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ నుండి కొండగట్టు వరకు పెద్ద ఎత్తున అలంకరణ చేసే పనిలో కాషాయ శ్రేణులు నిమగ్నమయ్యాయి. ప్రధానంగా 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు జరుగుతున్నందున....పాదయాత్ర సందర్భంలో రోడ్డుపై ట్రాఫిక్ జాం కాకుండా క్రమశిక్షణతో నడుస్తూ అంజన్న ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కాషాయ శ్రేణులను కోరారు. అదే సమయంలో పాదయాత్రలో పాల్గొనే వారంతా ఈ14న శనివారం ఉదయం 6 గంటలకే మహాశక్తి ఆలయానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మిక భావన పెంపొందించేలా భక్తి పాటలు, డీజే సౌండ్, డప్పు సప్పుళ్లతో నభూతో నభవిష్యత్ అనేలా "అంజన్న ఆశీర్వాద యాత్ర"ను విజయవంతం చేయాలని బండి సంజయ్ కుమార్ కోరారు. అంజన్న ఆశీర్వాద యాత్రలో పాల్గొనే వారందరికీ ఆద్యంతం ఇబ్బందుల్లేకుండా భోజన, ఇతరత్రా సౌకర్యాలు కల్పించేందుకు భక్తమండళ్లు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి.

### పాదయాత్ర ప్రారంభమయ్యేదిలా....

14న ఉదయం 6 గంటలకు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం వద్దకు బండి సంజయ్ చేరుకుంటారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడికి చేరుకున్న కార్యకర్తలతో కలిసి కొండగట్టుకు కాలినడకన బయలుదేరుతారు. కొత్తపల్లిలో స్థానిక కార్పొరేటర్లు వాసాల రమేశ్, వేముల కవిత చంద్రశేఖర్, హరిప్రసాద్ పాదయాత్రకు ఘన స్వాగతం పలుకుతారు. అక్కడి నుండి రామడుగు, వెదిర, కురిక్యాల మీదుగా గంగాధర చేరుకుంటారు. అక్కడే స్థానిక వీఏఎస్ ఫంక్షన్ హాలులో కాసేపు సేద తీరుతారు. కార్యకర్తలంతా అక్కడే మధ్యాహ్నం భోజనం చేస్తారు. అనంతరం వెంకటయ్యపల్లి, పూడూరు, దొంగలమర్రి, మీదుగా కొండగట్టు ఘాట్ రోడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుండి నేరుగా అంజన్న ఆలయం వద్దకు వెళ్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.

## ప్రజా సేవలో భాగస్వామ్యం.. భగవంతుడిచ్చిన వరం!

**ఖమ్మం వెలుతురు మార్చి 12:**

"రాజకీయాల్లోకి మనం వచ్చింది కేవలం ప్రజా సేవ కోసమే. ఐదేళ్ల తర్వాత మనం పదవి నుంచి దిగిపోయేటప్పుడు.. మన గ్రామం, మన వార్డు ఎంతో అభివృద్ధి చెందిందని ప్రజలు మనల్ని మనస్ఫూర్తిగా అభినందించాలి. ఆ ఆత్మీయతే మనం సంపాదించుకునే అసలైన ఆస్తి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**అభివృద్ధికి బాటలు వేద్దాం**

గ్రామ పంచాయతీల బలోపేతం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. "గడిచిన కొద్ది రోజుల్లోనే పంచాయతీల ఖాతాల్లోకి గణనీయంగా నిధులు జమ అయ్యాయి. మార్చి ఆఖరు నాటికి మరిన్ని నిధులు రాబోతున్నాయి. ఈ నిధులను ఒక ప్రణాళికాబద్ధంగా, ప్రజలకు ఉపయోగపడే పనుల కోసం వినియోగించాలి. మన సొంత డబ్బును ఎంత జాగ్రత్తగా వాడుకుంటామో.. ప్రజా ధనాన్ని కూడా అంతే బాధ్యతగా కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలి" అని సర్పంచులకు సూచించారు.

**సమన్వయంతో సమస్యల పరిష్కారం**

అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు



సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి కోరారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనలో చిన్నపాటి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

**అందరి లక్ష్యం ప్రజా శ్రేయస్సే**

"ఎన్నికల వరకే రాజకీయాలు.. గెలిచిన తర్వాత మనమంతా ప్రజల సేవకులం. పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులకు అధికారులు పూర్తి స్థాయిలో మార్గనిర్దేశం చేస్తూ, వారిని ప్రోత్సహించాలని ఈ వేదిక ద్వారా కోరారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల ప్రణాళికలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే

లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ పూర్తిగా ఆపేయాలన్నారు. అలా జరగని పక్షంలో చావు తప్పదని హెచ్చరించారు. ఫిబ్రవరి 28వ తేదీ లాంటి దాడులు మరోసారి జరుగుతాయని చెప్పారు. ఇజ్రాయెల్ సాయంతో మొజ్తాబాను చంపేస్తామని తేల్చి చెప్పారు.

## ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణాకు ఐకాన్

**హైదరాబాద్,మార్చి12 వెలుతురు:**

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని ఆయన చెప్పారు. ఇంతటి పేరెన్నికగన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తాను కాంక్షిస్తున్నానని ఆయన చెప్పారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్-26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు. సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు.అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికీ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు.అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అని అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని,అంతే గాకుండా గల్లీ నుండి డిల్లో స్థాయికి ఎదిగిన నేతలు,క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాద్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్-26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేదికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.

## నీటి వినియోగంలో జాగ్రత్తులు ముఖ్యం

తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్- సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య- నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తున్నారు. జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను సీఎం అధికారులకు వివరించారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. గత వైకాపా హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమేనని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ పథకాల లబ్దిదారులకు ప్రజా ప్రతినిధుల ద్వారా సంక్షేమ లేఖలు అందివ్వాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ పథకాల పారదర్శకతతో అమలుకు, ఓనర్‌షిప్ తీసుకునేందుకు సంక్షేమ లేఖలు ఇవ్వాలని నిర్ణయించారు. పెట్టుబడుల గురించి ఆలోచించినట్లే... పేదల గురించి ఆలోచించాలని సూచించారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఓ లేఖను లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. లబ్దిదారులకు ప్రతీ నెలా ఏం లబ్ది కలిగిందో తెలియజేయాలని సూచించారు. ఏ కుటుంబానికి ఏం లబ్ది కలిగిందో తెలిస్తే అంతా పారదర్శకంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలిండర్, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటివి లబ్దిదారులకు తెలియాలని సూచించారు. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. డీబీటీ పథకాల్లో ప్రోగ్రామబుల్ వోచర్లను లబ్దిదారులకు ఇస్తే వారు వినియోగించుకుంటారన్నారు. మార్చి 9వ తేదీ నాటికి ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా 50.45 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని.. రూ.1775 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీయంబర్స్ చేసిందని వివరించారు. డ్వాక్రా, మెప్మా సంఘాల సేవలను వినియోగించుకుని పీ4తో సహా జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.అన్నదాత సుఖీభవ ద్వారా రేపు మూడో విడత నిధులు విడుదల చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అన్నాక్యాంటీన్ల ద్వారా 7.5 కోట్ల భోజనాలు ఇప్పటి వరకూ పేదలకు అందించగలిగామని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీ, ఆశాలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్నామని అన్నారు. రూ. వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని తెలిపారు. పల్లె పండుగ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. సంక్షేమ పథకాలు పేదలందరికీ అందించడమే లక్ష్యంగా కలెక్టర్లు పనిచేయాలని మార్గనిర్దేశర చేశారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. ప్రతీ ఒక్కరికీ ఇంటిస్థలం లేదా ఇంటిని మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉగాదికి 2.50 లక్షల మందికి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ ఇంటికీ జేజేఎం కింద తాగునీటి కుళాయి ఇస్తామని... ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాలిడ్, లిక్విడ్ మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నెట్ జీరో కాన్సెప్టుగా ఘన వ్యర్థాలను వేస్ట్ టూ ఎనర్జీ ఎ÷-లాంట్లకు తరలించాలని ఆదేశించారు. తడి వ్యర్థాలను కంపోస్టు తయారు చేసేందుకు మళ్లించాలని సూచించారు. 500 పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టులో కిచెన్ గా÷-డర్గ÷న్, బయోడైవర్సిటీలో భాగస్వాములను చేయాలని సూచించారు. వీబీజీ రామ్ జీ కింద రూ.9773 కోట్లు ఏపీకి కేటాయించారని అన్నారు. ఇప్పుడు ఈ పథకం డిమాండ్ డ్రివెన్ కాదని... దీనికి అనుగుణంగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెట్టుబడుల గురించి ఎలా ఆలోచిస్తున్నామో... పేదలకు అందించే సంక్షేమం గురించి... వారికి కల్పించే సాధికారత గురించి కూడా కలెక్టర్లు ఆలోచించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు.

# దక్షిణ భారతదేశంలో అతిపెద్ద సిఎస్ఆర్ సమ్మిట్ 2026 పోస్టర్ ఆవిష్కరణ



**హైదరాబాద్, వెలుతురు మార్చి 12:**

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) సమ్మిట్ 2026కు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను గురువారం రోజున ఆవిష్కరించారు. ఈ సమ్మిట్ జూలై 25, 2026న హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించబడనుంది. ఈ ఏడాది సమ్మిట్ థీమ్ "Change to Legacy"గా నిర్ణయించారు. ఈ పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సమాజంపై సానుకూల ప్రభావం చూపే కార్యక్రమాలను నిర్వహిస్తున్న సమ్మిట్ నిర్వాహకులను అభినందించారు. ఈ సమ్మిట్ ద్వారా కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీఓలు, సోషల్ ఇన్నోవేటర్లు మరియు స్టార్టప్‌లు ఒకే వేదికపైకి వచ్చి సామాజిక అభివృద్ధికి కలిసి పనిచేసే అవకాశం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమంలో వినిల్ రెడ్డి ఎదుదొడ్ల (లైసెన్సీ), వంశీ ముత్యపు (మేనేజింగ్ డైరెక్టర్), ఆదిత్య వేదాంతం (డైరెక్టర్), సుమంత్ వల్లాల (డైరెక్టర్)పాల్గొన్నారు. సమ్మిట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

# టీపీసీసీ ఎస్సీ విభాగ చైర్ పర్సన్ గా మాన కొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పదవి స్వీకార మహోత్సవ కార్యక్రమం

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**



**గాంధీ భవన్ వెలుతురు మార్చి 12:**




టీపీసీసీ ఎస్సీ విభాగ చైర్ పర్సన్ గా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పదవి స్వీకార మహోత్సవ కార్యక్రమం ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరైన మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి,ఎమ్మెల్యేలు వేముల వీరేశం,లక్ష్మీ కాంత్, యెన్నం శ్రీనివాస్, మేడిపల్లి సత్యం,నాగరాజు, వినోద్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, ఫైనాన్స్ చైర్మెన్ రాజయ్య,ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ గారు, మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు, జేబి రాజు, తదితరులు పాల్గొన్నారు. టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ బరువైన బాధ్యత ను నమ్మకంతో సీఎం తో కలిసి కవ్వంపల్లి సత్యనారాయణ పై పెట్టాము పీసీసీ బలోపేతం కావాలనే ఉద్దేశ్యం తో కవ్వంపల్లి కి పదవి దళిత వాదంతో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ రెడ్డికి సీఎం, బిసికి పీసీసీ అధ్యక్ష పదవి, దళితులు డిప్యూటీ సీఎం, స్పీకర్ పదవి,నాలుగు మంత్రి పదవులు కేవలం కాంగ్రెస్ లో మాత్రమే సాధ్యం 90 ఏళ్ల తర్వాత కుల సర్వే చేసి అఫిషియల్ డాక్యుమెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది క్లిష్ట సమయాల్లో దళితులు కాంగ్రెస్ పార్టీ కి అండగా నిలిచారు దళితులకు, ఆదివాసీలకు, బీసీలకు సముచిత స్థానం, కెసిఆర్ రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పులో ముంచి పోయారు, 17 శాతం ఉన్న ఎస్సీలకు 5 ముఖ్యమైన స్థానాలు ఇచ్చాం, రాబోయే పదవుల పంపకాల్లో ఎస్సీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తాం, రాజయ్యను అర్ధరాత్రి డిప్యూటీ సీఎం పదవి నుంచి కేసీఆర్ ఎలా తొలగించారో గుర్తు చేస్తున్నా, సభ్యత్వ కార్యక్రమంలో రోజుకు 100 మంది చేరేలా కృషి చేయాలి 100 సీట్లతో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తామని ధీమా, బిఆర్ఎస్ నాలుగు ముక్కలు అయ్యింది, తెలంగాణలో బీజేపీకి చోటు లేదు, ఎస్సీ డిపార్ట్మెంట్ ను శక్తి వంతంగా తయారు చేయాలని కవ్వంపల్లికి సూచిస్తున్న, రాబోయే ఎన్నికల్లో ఎస్సీ తరపున కవ్వంపల్లికి సూచించిన వారికి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు

# బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

- స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం, 
- తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,మార్చి12 వెలుతురు:**



తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్పటికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

# యుద్ధం యొక్క రంగు ఎరుపు - మానవత్వం మిగిల్చిన ప్రశ్నలు



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*చరిత్ర పుటలను తిరగేస్తే మనకు కనిపించేది రక్తపాతమే. ప్రతి యుద్ధానికి ఒక కారణం ఉంటుంది, ప్రతి పోరాటానికి ఒక నినాదం ఉంటుంది. భూమి కోసం, చమురు వనరుల కోసం, మతం కోసం, భావజాలం కోసం లేదా కేవలం అహంకారం కోసం యుద్ధాలు జరుగుతుంటాయి. కానీ ఏ యుద్ధమైనా చివరికి మిగిల్చేది ఒకే కథ అంతులేని మానవ నష్టం, విధ్వంసం మరియు భరించలేని వేదన. ఇరాన్ మరియు దాని చుట్టూ జరుగుతున్న ప్రస్తుత సంఘర్షణ కూడా ఈ పాత నమూనానే అనుసరిస్తోంది. రాజకీయ నాయకులు, వ్యూహకర్తలు తమ ఏసీ గదుల్లో కూర్చుని మ్యాపుల మీద గీతలు గీస్తారు, యుద్ధ ప్రకటనలు చేస్తారు. కానీ ఆ గీతల మధ్య నలిగిపోయేది సామాన్య మనిషి. రణరంగంలో తుపాకీ పట్టుకుని నిలబడే సైనికుడికి, అవతలి వైపు ఉన్న వ్యక్తి ఎవరో తెలియదు. అయినా ఒకరినొకరు చంపుకోవాలి ఎందుకంటే అది ఆజ్ఞ . ఇక్కడ ప్రాణాలు కోల్పోయిన ప్రతి సైనికుడి వెనుక ఒక విచ్ఛిన్నమైన కుటుంబం ఉంటుంది. తల్లులు తమ గర్భశోకాన్ని దిగమింగుకుంటారు, పిల్లలు నాన్న ఎప్పుడు వస్తాడు? అని అడిగే ప్రశ్నలకు సమాధానం ఉండదు.*

యుద్ధంలో అసలు గెలుపు అనేది ఒకటి ఉంటుందా? భౌగోళిక పటాలపై సరిహద్దులు అంగుళం అటు ఇటు మారవచ్చు, ప్రభుత్వాలు పడిపోవచ్చు లేదా కొత్తవి రావచ్చు. కానీ కోల్పోయిన ఒక్క జీవితాన్ని అయినా మనం తిరిగి తీసుకురాగలమా? ప్రతి మరణం ఒక అసంపూర్ణ కల. ప్రతి బాంబు దాడి ఒక శిశువు బాల్యాన్ని శాశ్వతంగా చిదిమేస్తుంది. ఈ నష్టాన్ని ఏ రాజకీయ విజయం భర్తీ చేయలేదు. మనిషి ఈ గ్రహం మీద అత్యంత తెలివైన జీవి అనడంలో సందేహం లేదు. మనం అంతరిక్షాన్ని జయించాం, చంద్రుడిపై అడుగు పెట్టాం, ప్రాణాంతక వ్యాధులకు మందులు కనుగొన్నాం, అద్భుతమైన సాహిత్యాన్ని, కళలను సృష్టించాం. కానీ అదే మనిషి తన తోటి మనిషిని సెకన్ల వ్యవధిలో బూడిద చేసే అణుబాంబులను, క్షిపణులను కూడా తయారు చేసుకున్నాడు. ఇది మానవ స్థితి యొక్క గొప్ప విషాదం. మన సాంకేతిక సామర్థ్యం పెరిగింది కానీ, మనలోని కరుణ పెరగలేదు. మన మేధస్సు పెరిగింది కానీ, మన విజ్ఞత వెనుకబడింది. ఇరాన్ సంఘర్షణను నిశితంగా గమనిస్తే, ఇరువైపులా ఉన్న ప్రజల ప్రాథమిక అవసరాలు ఒకటేనని అర్థమవుతుంది. అందరికీ కావాల్సింది భద్రత, రెండు పూటల కూడు, పిల్లలకు మంచి భవిష్యత్తు మరియు ప్రశాంతమైన నిద్ర. అయినప్పటికీ, మతం పేరుతోనో, జాతీయవాదం పేరుతోనో వారిని శత్రువులుగా చిత్రీకరిస్తారు. ఒక తల్లి తన బిడ్డను కోల్పోయినప్పుడు అనుభవించే వేదనకు సరిహద్దులు ఉండవు. కన్నీరు ఏ కంటి నుంచి కారినా దానికి రంగు ఉండదు, బాధకు భాష ఉండదు. మనం విజ్ఞానశాస్త్రంలో ఎంతో ఎదిగినా, పక్కవాడిని ప్రేమించడం అనే ప్రాథమిక పాఠాన్ని ఇంకా నేర్చుకోలేకపోతున్నాం. శతాబ్దాలుగా తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు మనల్ని అడుగుతున్న ప్రశ్న మనిషి ఉనికికి అర్థం ఏమిటి? అని. కొందరు ఇది దైవ సృష్టి అంటారు, మరికొందరు ప్రకృతి పరిణామం అంటారు. కానీ యుద్ధం మన ముందు ఒక కఠినమైన ప్రశ్నను ఉంచుతుంది మనం సృష్టించడానికి పుట్టామా లేక నాశనం చేయడానికా?

ఒక మనిషి ఈ లోకంలోకి రావడానికి తొమ్మిది నెలల గర్భవాసం, ఎన్నో ఏళ్ల సంరక్షణ, తల్లిదండ్రుల త్యాగాలు, సమాజం యొక్క పెట్టుబడి అవసరం. ఒక నిండు జీవితం అనేది అసంఖ్యాకమైన అనుభవాల సమాహారం. కానీ యుద్ధం ఆ విలువైన జీవితాన్ని ఒక క్షణంలో గణాంకం (Statistic) గా మార్చేస్తుంది. యుద్ధ వార్తల్లో వంద మంది చనిపోయారు అని చదివినప్పుడు, మనం వంద సంఖ్యలను చూడటం లేదు, వంద ప్రపంచాల అంతాన్ని చూస్తున్నాం. ప్రతి మనిషి ఒక సజీవ గ్రంథం. యుద్ధం ఆ గ్రంథాన్ని అర్ధాంతరంగా చింపివేస్తుంది. మనం జీవించడానికి పుట్టాం, ఒకరికొకరు



తోడుగా ఉండటానికి పుట్టాం. హింస అనేది మన సహజ స్వభావం కాకూడదు. చాలామంది శాంతి అంటే యుద్ధం లేకపోవడం అని అనుకుంటారు. కానీ అది పొరపాటు. శాంతి అనేది ఒక చురుకైన ఎంపిక. అది ప్రతిరోజూ మనం చేసే నిరంతర కృషి. శాంతి అంటే మన మధ్య ఉన్న భేదాలను గుర్తించి, వాటిని గౌరవించడం. ఇరాన్ సంఘర్షణ అయినా, మరే ఇతర ప్రపంచ పోరాటాలైనా మనకు ఒకటే సందేశాన్ని ఇస్తున్నాయి విభజన అనేది వినాశనానికి దారితీస్తుంది.

మనం మన పిల్లలకు యుద్ధ తంత్రాలను కాదు, సంభాషణ (Dialogue) యొక్క గొప్పతనాన్ని నేర్పాలి. కత్తితో సాధించలేనిది కరుణతో సాధించవచ్చని నిరూపించాలి. ప్రతి యుద్ధం మనుషులు తీసుకునే తప్పుడు నిర్ణయాల ఫలితమే అయినప్పుడు, శాంతి కూడా మనుషులు తీసుకునే సరైన నిర్ణయాల వల్లే సాధ్యమవుతుంది. భూమి కోసం కొట్టుకోవడం కంటే, ఆ భూమిని అందరికీ నివాసయోగ్యంగా మార్చడం మిన్న. దౌత్యం, చర్చలు, పరస్పర అవగాహన ఇవే మనల్ని వినాశనం నుండి కాపాడే ఆయుధాలు. ఇరాన్ యుద్ధభూమిలో బాంబులు పేలుతున్నప్పుడు, ఎక్కడో సుదూరంగా ఉన్న మనం నాకేంటి? అని మౌనంగా ఉండటం సరికాదు. యుద్ధం మరియు శాంతి అనేవి కేవలం ప్రభుత్వాల వ్యవహారం కాదు. ఇది ప్రతి పౌరుడి బాధ్యత. మనం శాంతి కోసం గళం విప్పాలి. ద్వేషాన్ని పెంచే ప్రచారాలకు (Propaganda) దూరంగా ఉండాలి. హింసను ప్రేరేపించే మాటల కంటే, మానవత్వాన్ని కలిపే మాటలకే ప్రాధాన్యత ఇవ్వాలి. మనం మన తర్వాతి తరానికి ఎలాంటి ప్రపంచాన్ని ఇస్తున్నాం? రక్తంతో తడిసిన నేలనా లేక పచ్చని చెట్లతో కూడిన ప్రశాంతమైన భూమినా? మనం చేసే ప్రతి ఎంపిక భవిష్యత్తును రూపొందిస్తుంది. జీవితం చాలా చిన్నది, దానిని ద్వేషించడానికి లేదా నాశనం చేయడానికి వృధా చేయకూడదు. మనం మనలోని కరుణను తిరిగి కనుగొనాలి. ఇరాన్ సంఘర్షణ మనకు ఒక హెచ్చరిక మనం మారకపోతే, మన ఉనికికే ప్రమాదం. ఎంతటి చీకటి రాత్రి తర్వాతైనా సూర్యోదయం తప్పదు. మానవ చరిత్రలో ఎన్నో భయానక యుద్ధాలు జరిగాయి, కానీ మనిషి మళ్లీ శాంతి వైపు అడుగులు వేశాడు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత నాశనమైన దేశాలు నేడు అభివృద్ధి పథంలో ఉన్నాయి. శత్రువులుగా ఉన్న దేశాలు మిత్రులుగా మారాయి. ఈ చరిత్ర మనకు ఆశను ఇస్తుంది. మార్పు సాధ్యమే.

ఇరాన్ మరియు దాని పొరుగు ప్రాంతాల్లో కూడా శాంతి సాధ్యమే. దానికి కావాల్సింది రాజకీయ సంకల్పం మాత్రమే కాదు, ప్రతి మనిషిలో మానవత్వపు మేలుకొలుపు. మనం ప్రేమించడానికి, సృష్టించడానికి మరియు తోటివారికి సహాయం చేయడానికి పుట్టాం. ఇదే మన పరమార్థం. యుద్ధం అనేది ఒక తాత్కాలిక మాలిన్యం, శాంతి మన శాశ్వత స్వభావం. ఇరాన్ యుద్ధభూమి మనకు ఒక అద్దాన్ని చూపిస్తోంది. ఆ అద్దంలో మన అసలు రూపం మన బలహీనతలు, మన తప్పులు కనిపిస్తున్నాయి. కానీ అదే అద్దంలో మనం మారగలమనే ఆశ కూడా కనిపిస్తోంది. మనం జ్ఞానంతో, దయతో, సానుభూతితో వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది. రక్తపు చారికలు లేని రేపటి కోసం, ఆయుధాలు లేని ప్రపంచం కోసం మనం మనవంతు ప్రయత్నం చేద్దాం. మన ఉనికికి అర్థం మనం పంచుకునే ప్రేమలోనే ఉంది, మనం చేసే యుద్ధాల్లో కాదు. శాంతి అంటే కేవలం యుద్ధం లేకపోవడం కాదు అది ఒక సానుకూలమైన, క్రియాశీలకమైన ప్రేమ స్థితి. - మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ఈ మాటలను మనం మన గుండెల్లో పదిలపరుచుకుందాం. యుద్ధం వద్దు, మానవత్వం ముద్దు. ప్రపంచ శాంతి మనందరి ఉమ్మడి ఆకాంక్ష కావాలి.

# ప్రజా సమస్యల పరిష్కారానికే "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక"

**- తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్.**




**హైదరాబాద్, వెలుతురు మార్చి 12:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన" ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" జూన్ 12 వరకు కొనసాగుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని కార్యక్రమాలను జయప్రదం చేయాలని, తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతీ శ్రీకాంత్ గౌడ్ అధికారులను కోరారు. గురువారం నాడు, దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్, బీసీ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం అందులో ఒక భాగం అని అన్నారు 99 రోజుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అందరినీ భాగస్వాములను చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిరోజు పార్కులకు వచ్చే వాకర్లు ఈ ప్రత్యేక పరిశుభ్ర కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

### పారిశుద్ధ్యానికి మొదటి ప్రాధాన్యం

వేసవి ప్రారంభమైందని, దీనితో పాటు దోమల బెడద కూడా ప్రారంభమైంది కావున పారిశుద్ధ్య కార్యక్రమానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. రోడ్ల శుభ్రం, డ్రైన్ల శుభ్రం, అంగన్ వాడిలు, మార్కెట్లు, హాస్టళ్ళు, బస్టాండ్లలో శుభ్రత, రోడ్ల వెంట ఖాళీ ప్రదేశాలలో చెట్లపొదలు తొలగింపు, వంటి పనులు ఇందులో భాగం గా ఉంటాయని అన్నారు. రెవిన్యూ ఆగ్ మెంటేషన్ కింద కొత్త ఇండ్లు, పరిశ్రమలు, కమర్షియల్ భవనాల అసెస్మెంట్, ట్రేడ్ లైసెన్స్ జారీ, మార్కెట్లు షాపింగ్ కాంప్లెక్స్ వేలం పూర్తి 100% టాక్స్ ల వసూళ్లు ఇతర ఫీజులు వసూళు, 2026- 27 సంవత్సరానికి టాక్స్ నిర్ధారణ,పంచాయతీలు, అంగన్ వాడీ భవనాలు, సిసి రోడ్ల నిర్మాణం వంటి పనులు, చేపడతారని వివరించారు.

తాగునీటికి సంబంధించిన పైపుల రిపేర్, పైపులతో కొత్త కనెక్షన్లు వంటివి గుర్తింపు వాటి రిపేర్లు కొత్త కనెక్షన్లకు మెటీరియల్ సేకరణపై కార్యాచరణ ప్రణాళిక, అధికారులు తయారు చేస్తారని పంచాయతీ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఇతర వనరుల గుర్తింపు పూర్తి చేస్తారని అన్నారు. అన్ని ఇళ్లలో ద్రవ, ఘన, వ్యర్థాలను విడదీసి సేకరించే పని ప్రతి గ్రామ పంచాయతిది అని కంపోస్టు ఎరువు తయారీ వరద నిర్వహణ పద్ధతులపై శిక్షణ, ఈ వేస్ట్, బయో మెడికల్ వేస్ట్, శానిటరీ వేస్ట్, సేకరణ సురక్షితంగా డిస్పోజ్ చేయడం ద్రవ్య వ్యర్థాల నిర్వహణ చర్యలు కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ల వంటి వాటిని చేపడుతారని పేర్కొన్నారు. ఉపాధి హామీ అమలు తీరు చేపట్టిన పనులను పరిశీలిస్తారని వర్షాకాల సన్నద్ధతలో భాగంగా వరద నీటి కాలువల డిసిల్టింగ్, లోతట్టు ప్రాంతాల ఫీలింగ్ యాంటీ లార్వా కెమికల్స్, ఫాగింగ్ స్ప్రే, శుక్రవారం డ్రై డే పాటింపు, ఉపాధి హామీ కింద మొక్కల పెంపకం, వాటికోసం స్థలాల గుర్తింపు,మొక్కలు నాటడం వంటి పనులు చెయ్యాలని అన్నారు. నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అనూహ్య స్పందన లభించింది. బీసీ కార్పొరేషన్ కు సంబంధించిన అన్ని పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని, అందుకు కావలసిన కార్యాచరణను రూపొందించుకోవాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీసీ కమిషనర్ శ్రీమతి బాలమాయాదేవి, ఎండి మల్లయ్య భట్టు, సీఈఓ అలోక్ కుమార్, ఎం.డి.లు ఉదయ్ ప్రకాష్, శ్రీమతి ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది, పాల్గొన్నారు.

# త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కనుసన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు.

అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం అని తెలిపారు. జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సివి ఆనంద్, శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం..

# ధాన్యం ఎగుమతి,దిగుమతులను సమీక్షించాలి !

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలతో ఎగుమతులు, దిగుమతులు ఆగిపోయాయి. ఓ రకంగా ఇది మనం సంక్షోభాన్ని సరిదిద్దుకునే సమయంగా భావించాలి. ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నా భారత్ ఈ దశలో వీటిపై పునరాలోచన చేయాలి. దేశీయంగా పప్పు ధాన్యాలు, నూనె ధాన్యాలు విపరీతరంగా పండుతున్నా, రైతులకు కనీస మద్దతు ధరలు చెల్లించడం లేదు. అలాగే వేసిన పంటలను కొనుగోలు చేయడం లేదు. తెలంగాణలో శనగ, మక్కజొన్నలకు డిమాండ్ లేకుండా పోయింది. శనగ కొనుగోళ్లపై స్పష్టత కరవైంది. రైతులు సాగుచేసిన శనగ పంటకు మద్దతు ధర అందించడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత కరువైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనగ పంటను నిల్వ ఉంచుకున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు వాపోతున్నారు. ఈ దశలో దేశీయంగా ఆయా రాష్ట్రాల్లో పండుతున్న పంటలను కొనుగోలుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, ప్రజలకు సరసమైన ధరల్లో అందించాలి. అదేవిధంగా దిగుమతులపై పూర్తి ఆంక్షలు విధించాలి. నూనెలు, పప్పులను దిగుమతి చేసుకోవడం తక్షణం ఆపాలి. గత కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి సంబంధించి మూడు పద్దులను అంటే రూ.60 వేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ఖర్చు



పెట్టలేదని సమాచారం.. ఈ సంవత్సరం అందుకు భిన్నంగా జరుగుతుందని ఆశించలేం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంవత్సరం బడ్జెట్లో ధరల స్థిరీకరణ కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కేంద్రం ఎఫ్‌సిఐ ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి కొనాల్సిన కందులు, శనగలు, పెసలు, మొక్కజొన్నలు లాంటి 25 రకాల పంటలను కొనడానికి నిరాకరించింది. దేశంలోని 24 వేల స్థానిక మార్కెట్లు, 125 ప్రత్యేక మార్కెట్ల నిర్వహణను వదిలేయడం సరైనది కాదు. నిజానికి ధాన్యం సేకరణ, తిరిగి ప్రజలకు వాటిని ఆహార ధానా÷-యల రూపంలో చేరవేయడంలో పక్కా ప్రణాళిక లేకుండా పోయింది.ప్రైవేటు వ్యక్తులు కంపెనీలు, మార్కెట్లు పెట్టుకునేందుకు అనుమతించే బిల్లును గత ఫిబ్రవరిలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది. గత రెండు సంవత్సరాలుగా వరి ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, ఉల్లిపాయలు, కోకో లాంటి పంటలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలకు కొనేవారే లేకుండా పోయారు. తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవలసి వస్తున్నది. నిజానికి వ్యవసాయ విధానం సక్రమంగా ఉంటే, అనవసరపు దుబారా ఖర్చులు తగ్గించి, దేశీయంగా పంటలను ప్రోత్సహించి, ఉన్న పంటలను కొనుగోలు చేయాలి. అలాగే ప్రజలకు తక్కువ ధరలకు నిత్యాసవరాలు సరఫరా చేసే వ్యవస్థను రూపొందించాలి. దీంతో దేశంలో ఆకలి బాధతలు తగ్గడంతో పాటు, కొనుగోలు శక్తి కూడా పెరుగుతుంది. కానీ గొప్పలు చెబుతున్న బిజెపి నేతలు ఒక్కరు కూడా సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. పంటలు పండుతున్నా, సామాన్యులకు ధరలు అందడం లేదు. అలాగే ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు పెంచేస్తున్నారు. ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసే చట్టాలు చేయడం, పార్లమెంట్, అసెంబ్లీల్లో వ్యవసాయ ధరలు లేక రైతులు బాధపడుతున్నారని మొసలి కన్నీరు కార్చడం అలవాటైపోయింది. ఇకపోతే న కిలీ విత్తనాలు కూడా రైతులను నట్టేట ముంచుతున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు.కంపెనీ దగ్గర కొన్న విత్తనాలు సరిగ్గా మొలవకపోయినా, తగిన దిగబడి రాకపోయినా తర్వాత వ్యవసాయ సీజన్ లోపు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని 2001 విత్తన బిల్లులో ఉంది. కానీ ఈ తాజా బిల్లు ప్రకారం కంపెనీ విత్తనాలు రెండుసార్లు మొలవకపోయినా, సరైన దిగుబడులు రాకపోయినా ఆ రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించనవసరం లేదు. మూడవసారి ఆ కంపెనీ విత్తనాలు విఫలమైతే ఆ కంపెనీ ప్రభుత్వానికి ఫెనాల్టీ చెల్లించాలని బిల్లులో ఉంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని లేదు.పంటల బీమా చట్టం' కార్పొరేట్ కంపెనీలకు ధీమా కల్పిస్తున్నది కానీ రైతులకు కాదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆపరేషన్ గైడ్‌లైన్స్ మాత్రం వివరంగా ఉన్నాయి. ఆచరణలో ఈ పద్దు కింద ప్రతి సంవత్సరం కేటాయించే రూ.15 వేల కోట్లలో ఐదు వేల కోట్లు కూడా రైతులకు చేరడం లేదు. రూ.10 వేల కోట్లను కార్పొరేట్ బీమా కంపెనీలు మింగేస్తున్నాయి. వాతావరణం, క్రాప్ కటింగ్ ఎక్స్‌పరిమెంటేషన్‌లో ప్రైవేట్ కంపెనీల డేటాను వాడుతున్నారు. ప్రభుత్వ వ్యవసాయ బీమా కంపెనీలు దిమ్మాలుగా మిగిలిపోతున్నాయి. ప్రైవేట్ కంపెనీదే పెత్తనం, వారే దోచేస్తున్నారు.వ్యవసాయానికి సంబంధించి పురుగు మందులలో అత్యంత దోపిడి జరుగుతున్నది. 100 రూపాయల మందుని వెయ్యి రూపాయలకు, 300 రుపాయలది 3 వేలకు అమ్ముతూ వ్యాపారస్తులు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. దీనికి కారణం 'నూతన పురుగు మందుల విధానం'లో ఎం.ఆర్.పి విధానం పాటించాలని లేకపోవడమే. పురుగులను చంపడానికి ఆ ద్రావకంలో ఎంత శాతం మందు ఉండాలో అది ఉండక పోయినా వ్యాపారస్థులను అడిగేవారు లేరు. ఇలాంటి సమస్యలన్నీ చర్చించాలి. ఇందుకు తగిన సమయం ఇదే. సమగ్ర వ్యవసాయ విధానం,ఎగుమతులు దిగుమతులపై చర్చించాలి. దేశీయ పంటలను పండించుకుని తినేలా వ్యవస్థీకృత పద్ధతిని తీసుకుని రావాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. మన రైతులు ఆనందంగా ఉంటారు.

## దిక్కుతోచని శనగ, మక్కరైతులు

**- కొనుగోలు కేంద్రాలు లేక ఆందోళన**

**- ఉన్నతాధికారులకు నివేదించామన్న మార్క్‌ఫెడ్**



**నిజామాబాద్,మార్చి12( వెలుతురు):** జిల్లాలో శనగ, మక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పండించినా కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డికి పావుసేరు అన్నట్లుగా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అయితే ఈ సమస్యలపై అధికారుల నుంచి స్పష్టమైన హామీలు రావడం లేదు. శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదికను అందజేశామని మార్క్‌ఫెడ్ డీఎం శశిధర్ అన్నారు. ఎన్‌సీసీ వారి నుంచి అనుమతులు రాగానే కేంద్రాలు ఏర్పాటు చేసి శనగలు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మద్దతు ధర రూ.5,875 లభిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ తప్పడంలేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు, కుటుంబ అవసరాల కోసం దళారులకు రూ.4,900 నుంచి రూ.5,300 వరకు విక్రయించి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనగ పంట సాగు చేయడానికి పెట్టుబడి ఖర్చు ఎక్కువ కావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో దిగుబడి తక్కువగా వచ్చి సుమారు ఎకరానికి రూ.5,600 ఖర్చయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర లేక నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్‌లో వ్యాపారులు తక్కువ ధర అంటే రూ.5,100లకే అడుగుతున్నారు. ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై పంటను సేకరించి ఉంటే ఇబ్బందులు వచ్చేవి కావని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్కువ ధరకే అమ్మి రైతులు నష్టపోతున్నారు. పంట కోతకు వచ్చే సమయంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులు పంటలు అమ్ముకోగలరని అంటున్నారు. దీంతో రైతులకు శనగ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రాజ్యమేలుతున్నారు. రైతులు నిల్వ సౌకర్యం లేక, చేసిన అప్పుల ఒత్తిడితో పంటను అమ్ముకోవాల్సి వస్తున్నది. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని దళారులు తక్కువ ధరకే శనగలు కొనుగోలు చేసి, సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ ఎక్కువ ధరకు విక్రయించి లాభాలు గడిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

## దేశంలో గ్యాస్ సంక్షోభం

**- కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ**

**- పరిస్థితులపై అధికారుల సమీక్ష**

**న్యూఢిల్లీ,మార్చి12( వెలుతురు):**

పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. నల్లబజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నా మని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళు ,, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి. ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయీ' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది.

## రైతులను బలహీనం చేసేలా చట్టాలు

**- కౌలు రైతులను విస్మరిస్తున్న పాలకులు**

**- వ్యవసాయరంగం మరింత సంక్షోభంలోకి నెట్టే చర్యలు**

**అమరావతి,మార్చి12( వెలుతురు):**





పేద రైతు, కౌలు రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని చట్టాల ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మార్గం సిద్ధం చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. వ్యవసాయ సంక్షోభం, యువరైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయేగాని తరగడం లేదు. అందుకుగల కారణాలను, పరిష్కారాలను కనిపెట్టడంలో ప్రభుత్వం వైపు నుండి వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో 'డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్' పత్రాన్ని ప్రవేశ పెట్టినప్పుడు కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే సమయానికి వ్యవసాయరంగంపై ఆధారపడే జనాభా 60 శాతం నుండి 10 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు. నేడున్న వ్యవసాయ భూములు కూడా 30 శాతం చాలవని అంటున్నారు.. మిగతాది అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. అంటే ఆ భూములను ఎవరికైనా అమ్ముకోవచ్చన్న ధోరణి కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో మిగిలిపోయే మిగతా 50 శాతం జనాభాను పట్టణాలకు తరలించి వారిని చీప్ లేబర్‌గా వాడుకోవచ్చన్న దుర్మార్గ ఆలోచన కూడా ఇందులో ఇమిడి ఉంది. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ సంవత్సరం 100 లక్షల ఎకరాలను అమ్మకానికి సిద్ధం చేసింది. నూతన నీటి విధానం' ప్రకారం కాలువలకు, పొలాలకు మీటర్లు పెట్టి నీటి వాడకాన్నిబట్టి రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఈ విధానం పేద రైతులకు వ్యతిరేకమైనదిగా గుర్తించాలి. అప్పుడు సాగునీరు చాలా ఖరీదైనదిగా మారుతుంది. ఇకపోతే విత్తన బిల్లు 2025' చూస్తే రైతులకు ఆందోళన కలుగుతుంది. విద్యుత్ సవరణ చట్టం 2025' ప్రకారం మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రధానాంశం. ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలనేది మరో కీలకాంశం. ఇది మెట్ట ప్రాంతాలలో, గిరిజన ఏరియాలో, వెనుకబడ్డ ప్రాంతాలలో చిన్న రైతుల పంపుసెట్లు, లిఫ్ట్‌ల వ్యవసాయాన్ని బాగా దెబ్బతీస్తుంది. ఎరువుల విధానం 2025' ప్రకారం ఎరువులపై ప్రభుత్వ నియంత్రణ తొలగించారు. సకాలంలో రైతులకు అందక పోయినా, ఉండాల్సిన నాణ్యత లేకపోయినా, ధర పద్ధతులలో తేడాలున్నా ప్రభుత్వ యంత్రాంగానికి బాధ్యత లేదు. ఇప్పుడు ఈ విధానంలో అదనంగా నానో లిక్విడ్ యూరియాను ప్రవేశ పెట్టింది. దాంట్లో నత్రజని 45 శాతం నుంచి 4 శాతానికి తగ్గుతుంది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ మొత్తం తగ్గించి నగదు బదిలీ పథకం పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరుతోంది. నానో యూరియా తీసుకున్న రాష్ట్రంలో బస్తాకు రూ.800 సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. ప్రకృతి విపత్తుల చట్టం 25, సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవడానికి వున్న సూచనలు తొలగించారు. సెక్షన్ 13లో పంటలు కోల్పోయిన రైతులకు చెందిన రుణాలు వాయిదా వేసి తిరిగి పంట రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్‌ను తొలగించారు. ఇరవై నెలల్లో ఇన్ని చట్టాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి గుండెకాయ లాంటి కౌలు రైతులకు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అందించే చట్టం చేయకపోవడం దారుణం.

## నిరసలను లెక్క చేయని అమెరికా అధ్యక్షుడు

**- వాణిజ్య సుంకాలపై కోర్టు తీర్పు బేఖాతర్**

**- సెక్షన్ 301 తో దాడికి దిగబోతున్న ట్రంప్**

**వాషింగ్టన్,మార్చి12( వెలుతురు):**



ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలు చెల్లవంటూ అగ్రరాజ్య సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన క్రమంలో ట్రంప్ కొత్త ఎత్తులు వేస్తున్నారు. యుద్ధంతో దేశీయంగా తీవ్ర నిరసనలు వస్తున్నా లెక్క చేయడం లేదు. ఇతరదేశాలపై ఎలాగైనా టారిఫ్‌లు వసూలుచేయాలని కంకణం కట్టుకున్న ట్రంప్.. ఇందుకోసం కొత్తదారులు వెతుకుతున్నారు. తాజాగా 'సెక్షన్ 301' ఆయుధాన్ని బయటకు తీశారు. దీనికింద భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక ప్రకటన చేశారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద.. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కాంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని గ్రీర్ వెల్లడించారు. కాగా.. ఈ జాబితాలో కెనడా లేకపోవడం గమనార్హం. ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది. చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రపక్షాల పైనా అమెరికా ఈ దర్యాప్తు చేపట్టడం చర్చకు దారితీసింది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ అమలుచేస్తోన్న అధిక సుంకాలు, స్థానిక తయారీ, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరాలు తెలుపుతోంది. ఈ అంశాల పైనే కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, తాజా దర్యాప్తుతో భారత్‌పై వెంటనే పెనాల్టీలు పడే అవకాశం లేనప్పటికీ.. భవిష్యత్తులో కొన్ని రంగాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. దీంతో ఆయా రంగాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## విచారణకు హాజరుకాని సునీల్ నాయక్

**విజయవాడ,మార్చి12 ( వెలుతురు):**

ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ గురువారం నాటి విచారణకు హాజరు కాలేదు. ఈ నెల 9 వరకు విచారణకు హాజరు కావాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే, విచారణ అధికారి విజ్ఞప్తి మేరకు ఈనెల 12 వరకు విచారణకు హాజరవ్వాలని స్పష్టం చేసింది. విచారణకుచివరిదైనప్పటికీ సునీల్ నాయక్ హాజరు కాకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



మరోవైపు సునీల్ నాయక్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ అర్హత పిటిషన్ హైకోర్టులో విచారణకు రానుంది.

## మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా బీసీలకు అవకాశం ఇవ్వాలి

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారిని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 12:** మిర్యాలగూడ మున్సిపాలిటీలో అత్యధిక శాతం బీసీలే కౌన్సిలర్ గా గెలిచారని మున్సిపాలిటీలో 50 శాతం బీసీలే ఓటర్లుగా ఉన్నారని సామాజిక న్యాయం పాటించి జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మిర్యాలగూడ మున్సిపల్ లీడర్ గా అవకాశం ఇవ్వాలని ఈరోజు హైదరాబాదులోని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు ఎమ్మెల్యే కేటీఆర్ గారిని హైదరాబాదులోని నంది నగర్ లో కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ గతంలో మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ లలో ఒక్కటి కూడా బీసీలకు ఇవ్వకుండా రెండు కూడా అగ్రవర్ణాలకి కేటాయించారని కనీసం ఇప్పుడైనా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా బీసీలకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి గౌడ్, మహేష్ యాదవ్ ఉన్నారు

## ట్రాన్స్ జెండర్ ల వివరాలు సేకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం బీసీల వివరాలను లెక్కించకపోవడం సిగ్గుచేటు.

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహం



**హైదరాబాద్ వెలుతురు మార్చి 12:** త్వరలో జరిగే జనగణనలో ట్రాన్స్ జెండర్ ల వివరాలు సేకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం బీసీల వివరాలు సేకరించకపోవడం సిగ్గుచేటని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న రాజ్యసభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 2027లో నిర్వహించనున్న జనగణనలో ట్రాన్స్ జెండర్ అనే కొత్త కేటగిరీని కూడా చేర్చుతామని ప్రకటించడం 70 కోట్ల మంది బీసీలను అవమానపరచడమేనని అన్నారు. ట్రాన్స్ జెండర్లకు ఉన్న విలువ బీసీలకు లేదా అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిని ప్రశ్నిస్తున్న.ఎలాగూ ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు గదా అందులో బీసీల వివరాలు కూడా సేకరిస్తే బిజెపి పార్టీకి వచ్చే నొప్పి ఏంటనీ లింగంగౌడ్ ప్రశ్నించారు.

## రాష్ట్ర సీనియర్ నాయకులు చెల్లమల్ల కృష్ణారెడ్డి సహోదరుడి కుమార్తె వివాహంలో పాల్గొన్న సురిగి నరసింహగౌడ్




**హైదరాబాద్ వెలుతురు మార్చి 12:** గురువారం రోజున తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లమల్ల కృష్ణారెడ్డి గారి సహోదరుడి కుమార్తె వివాహానికి హాజరు కావడం జరిగింది, ఈ కార్యక్రమంలో మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సురిగి నరసింహగౌడ్ మచ్చ గిరి సూరి స్వామి మునుకుంట్ల వెంకటేష్ పచ్చిపాల మహేష్ ఏ రోజు కిషోర్ చారి తదితరులు పాల్గొన్నారు


## అంబర్పేటలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి



**బషీర్బాగ్ వెలుతురు 12 మార్చి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంబర్పేట్ ఎమ్మెల్యే గౌరవనీయులు కాలేరు వెంకటేష్ గారి సూచన మేరకు బిఆర్ఎస్ ఉద్యమ నాయకులు మల్లికార్జున యాదవ్ గారు అంబర్పేట్ డివిజన్ జిహెచ్ఎంసి మహిళా సిబ్బందికి, ఆశ వర్కర్లకు, మహిళా నాయకులకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు మరియు జిహెచ్ఎంసి మహిళా సిబ్బంది సమస్యలను వచ్చే అసెంబ్లీ సమావేశాలు లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీసి తగిన విధంగా మహిళలకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలు మరింత బలంగా, శక్తివంతంగా మారి సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు లవంగం ఆంజనేయులు, మల్లేష్ యాదవ్, కన్నం జాకీ బాబు, ఆకుల మల్లేష్, అనిల్ గౌడ్, రఫిక్,మహేష్ ముదిరాజ్, నాగరాజు,తిరుపతిరావు, అజర్, వంగలా శేఖర్,రాహుల్, ఫెరోస్, లవంగు గణేష్, ఫయాజ్ మరియు మహిళా నాయకులు పద్మ,పావని, స్వాతి, హేమలత, భార్గవి,మనమ్మ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులకు అవగాహన సదస్సు





**శంకర్ పల్లి వెలుతురు మార్చి 12 :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శంకర్‌పల్లి పురపాలక సంఘం ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి పురపాలక సంఘం గౌరవ చైర్‌పర్సన్, గౌరవ వైస్ చైర్‌పర్సన్‌తో పాటు పురపాలక సంఘానికి చెందిన గౌరవ కౌన్సిల్ సభ్యులు అందరూ హాజరయ్యారు. ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించాల్సిన సేవలపై అధికారుల ద్వారా వివరమైన అవగాహన కల్పించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించడంలో ప్రజా ప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని ఈ సదస్సులో అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సు ద్వారా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలు, అమలు విధానం, స్థానిక సంస్థల పాత్ర వంటి అంశాలపై ప్రజా ప్రతినిధులకు సమగ్ర సమాచారం అందించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఈ సదస్సు ఉపయోగకరంగా ఉంటుందని పాల్గొన్న ప్రజా ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ కార్యక్రమాలపై మరింత అవగాహన పెంపొందించుకుని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు కృషి చేయాలని అధికారులు కోరారు.

# మార్చి 17న చేతి వృత్తిదారుల మహాధర్నా

- ఇందిరాపార్క్ ధర్నా జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ
- రాష్ట్ర బడ్జెట్ లో వృత్తిదారుల సంక్షేమానికి 25 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్.
- చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ తెలంగాణ రాష్ట్ర కమిటీ



**హైదరాబాద్ వెలుతురు మార్చి 12:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026-27సం.ము ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో చేతి వృత్తిదారుల సంక్షేమానికి 25 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, గత బడ్జెట్ లో కేటాయించిన నిధులు మార్చి చివరి వరకు మొత్తం ఖర్చు పెట్టాలని, సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి. రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు హైదరాబాద్ , రిసాలగడ్డ లోని వృత్తిదారుల భవనంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. వారితోపాటు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అమరావతీ, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి వెంకట నరసయ్య, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి కుమారస్వామి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళి, కార్యదర్శి యం.నరహరి,క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేశం, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు లంక సోమయ్య తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలు అమలు చేయాడం లేదు, ప్రతి సంవత్సరం బడ్జెట్లో 25 వేల కోట్ల నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు, వృత్తిదారుల రాష్ట్ర కార్పొరేషన్, ఫెడరేషన్ లకు గత సంవత్సరం బడ్జెట్ లో కేటాయింపులే తక్కువ ఉన్నాయని అవి కూడా ఖర్చు చేయలేదని అన్నారు. ఈ సంస్థలు పేరుకు మాత్రమే ఉన్నాయని, వీటికి నిధులు విధులు ఎలాంటి కేటాయింపులు లేవని, వీటితో వృత్తిదారులకు ఎలాంటి ఉపయోగం జరగడం లేదని అన్నారు. కేటాయించిన 1018 కోట్లు ఈనెల చివరి వరకు విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. 2026-27 బడ్జెట్ లో వృత్తిదారుల సంక్షేమానికి 25 వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని, వర్గీకరణ చేయాలని, వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 17వ తేదీన ఇందిరా పార్క్ వద్ద జరిగే వృత్తిదారుల మహా ధర్నాకు కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు, రజక వృత్తిదారులు, విశ్వకర్మ వృత్తిదారులు వడ్రంగి, ఇనుము పని, బంగారం, ఇత్తడి, శిల్పాలు చెక్కుట, క్షౌర వృత్తిదారులు, మేదర, దూదేకుల, కుమ్మరి, దాసరి, సగర, ఉప్పర,బట్రాజులు, బోయ, పూసల, టైలర్, బ్యాండు, వాయిద్య, ఒగ్గు, మందహెచ్చుల, దుబ్బుల కొలుపు, పడపోత్ర, గంగిరెద్దుల, జెట్టి, ఏనూటి తదితర సాంస్కృతిక వృత్తులవారు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## శంకర్‌పల్లి మార్కెట్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం





**శంకర్ పల్లి వెలుతురు మార్చి 12 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి పురపాలక సంఘం పరిధిలోని స్థానిక మార్కెట్‌లో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించి శుభ్రత పనులు చేపట్టారు. చెత్తను తొలగించడం, కాలువలు శుభ్రపరచడం, ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెట్ ప్రాంతంలో చెత్త పేరుకుపోకుండా ఉండేందుకు పురపాలక సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా మార్కెట్ పరిధిలో ఉన్న బల్క్ వేస్ట్ జనరేటర్లైన హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల యజమానులకు చెత్త నిర్వహణపై సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా వారు ఉత్పత్తి చేసే తడి చెత్తను ఆన్‌సైట్‌లోనే కంపోస్టింగ్ విధానం ద్వారా నిర్వహించుకోవాలని అధికారులు సూచించారు. ఈ విధంగా చెత్తను వేరు చేసి పర్యావరణానికి హానికరం కాకుండా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. పట్టణ పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు తెలిపారు. ప్రజలు, వ్యాపారులు పురపాలక సంస్థకు సహకరించి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, సరైన విధంగా నిర్వహించాలని కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శంకర్‌పల్లి పురపాలక సంఘం పరిధిలో ఇటువంటి పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలో మంచాల మండలం

- తాజాగా మరో 5.30కోట్ల నిధులు మంచాల మండలానికి మంజూరు
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**మంచాల వెలుతురు మార్చి 12:** మంచాల మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడు తూతెలం గాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లోఅభివృద్ధి శరవేగంగా జరుగుతుం దని మంచాల మండల అభివృద్ధికై ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి అధికనిధులు తీసుకొచ్చపను లు చేయిస్తున్నారని అన్నారు గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేస్తున్నారని అన్నారుతాజాగా మండలంలోనిఆరు ట్ల గ్రామానికి 90 లక్షలు లోయపల్లి గ్రామానికి 50లక్షలు నోముల 50లక్షలు తిప్పాయిగూడ 25 లక్షలు ఎల్లమ్మతండా 25లక్షలు రంగాపూర్ 25లక్షలు లింగంపల్లి 75లక్షలుబండలేమూర్ 25ల క్షలు జాపాల 50లక్షలు కాగజ్ ఘాట్ 25లక్షలు ఆగాపల్లి 25లక్షలు దాద్ పల్లి 25లక్షలు చెన్నా రెడ్డి గూడ 20లక్షలు చిత్తాపూర్ 20లక్షలు మొత్తం 5.కోట్ల30లక్షలు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారె డ్డి సహకారంతో హెచ్ఎండిఏనిధుల నుండి మంజూరైనట్లు తెలిపారు త్వరలో మంచాల మం డలంలోని అన్నిగ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీ వీధిలైట్లుతదితర మౌలిక సదుపాయాలు కల్పించ డానికి మరిన్నినిధులు రాబోతున్నాయని అన్నారుమంచాల మండల అభివృద్ధికి కంకణబద్దులై అధిక నిధులు కేటాయించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మండల ప్రజలతరపున ధన్యవాదా లు తెలిపారు

## దండుమైలారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సైకిల్స్ మరియు బ్యాగ్ లు పంపిణీ చేసిన యూత్ ఫర్ సేవ సంస్థ



**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 12:** ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం జిల్లాపరిషత్ పాఠశాల జిహెచ్ఎం గోవర్ధన్ సార్ ఆ ధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమనికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన జిల్లావిద్యాధికారి శ్రీ సుశీంద్ర రావు యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన సైకిల్స్ మరియు బ్యాగ్ లు పాఠశాల విద్యా ర్థులకు అందజేయడం జరిగింది ఈసందర్భంగా పాఠశాల బృందం డీఈవో గారికి మరియుయూ త్ ఫర్ సేవ సంస్థ సభ్యులు అరవింద్ గౌడ్ గారికి సన్మానం చేసి జ్ఞాపికలు అందజేయడం జరిగిం ది డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి మార్కులతో పదవ తరగతి పాస్ కావాలని అన్నారుఈకార్యక్రమంలో ఏ ఏ పి సి చైర్మన్ శోభ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ రామకృష్ణ వెంకటరమణ శ్రీదేవి నివేదిత సులోచన సుమలతసుజాత పుణ్యవతి అనిత రామేశ్వరి విజయ పూజారి రమేశ మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## కోహెడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన



**తుర్కయంజాల్ వెలుతురు మార్చి12:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగానిర్వ హించారుఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న సుమారు 260మంది పదవతరగతి విద్యా ర్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు జరిగింది ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ ప రిరక్షణకుతోడ్పడడం విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడడం లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించ డం విశేషంపాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మీలా విజయ్ కుమార్ ప్రముఖ డాక్యుమెం ట్ రైటర్ లింగం సుబ్రహ్మణ్యం మరియు విజయ్ కుమారి గారిని అభ్యర్థించగా వారు సానుకూ లంగా స్పందించి సుమారు రూ.30,000 విలువైన స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేసి విద్యార్థుల కు పంపిణీ చేశారు ప్లాస్టిక్ బాటిల్స్ వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉం చుకొని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ సహాయం అందించినట్లు తెలిపారు ఈ కార్యక్ర మానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి బాయి మేడంగారు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సా ధించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు ఇదే కార్యక్రమంలో అ భిలాష్ రెడ్డి పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే ముఖ్యమైన అధ్యయన మె టీరియల్‌ను అందజేశారు కార్యక్రమాన్ని ఉద్దేశించి సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు మీలా విజయ్ కుమార్ గారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం మన ఆరోగ్యానికి మరియు పర్యావరణానికి తీ వ్ర హానికరమని తెలిపారు ప్లాస్టిక్ బాటిల్స్ మరియు వస్తువులు ఎక్కువకాలం ఉపయోగించడం వల్ల వాటిలోని హానికర రసాయనాలు నీటిలో కలిసే ప్రమాదం ఉందని అవి మన శరీరానికి చేరి అనేక అనారోగ్య సమస్యలకు దారితీసే అవకాశముందని చెప్పారు ప్లాస్టిక్ నేలలో కలవడానికి వందల సంవత్సరాలు పట్టడం వల్ల భూమి నీరు మరియు పర్యావరణం కాలుష్యానికి గురవు తాయని వివరించారు అందువల్ల విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్టీల్ గాజు వంటి పర్యావరణానికి అనుకూల మైన వస్తువులను ఉపయోగించాల్సిన అవసరం ఉందని సూచించా రుఅలాగే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాల ని ఆకాంక్షించారు దాత లింగం సుబ్రహ్మణ్యం గారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం అవ సరమైతే ఎప్పుడైనా మీలా విజయ్ కుమార్ గారిని సంప్రదించాలని ప్రతి సంవత్సరం విద్యా ర్థు లకు అవసరమైన వస్తువులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు ఈకా ర్యక్రమంలో దాత కుటుంబ సభ్యులైన క్రాంతి కిరణ్ చైతన్య మరియు శ్వేత దంపతులు కూడా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు ఈకార్య క్రమంలో ఉపాధ్యా యులు లక్ష్మణ్ ఉమామహే శ్వరి మేడం గోపాల్ రెడ్డి రాధా మాధవి మేడం కొండయ్య జగదీశ్వరాచారి గణేష్ అమర్ సింగ్ బన్సీలాల్ చంద్ర మోహన్ వెంకటేష్ యాదయ్య అక్బర్ గార్లు మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థుల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేసిన మీలా విజయ్ కుమార్ గారిని ఉపాధ్యాయులువి ద్యార్థులు మరియు స్థానికులు అభినందించారు ఈకార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్ష ణపై అవగాహన పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులుపాల్గొన్నారు

## స్వర్గపురి రథం ప్రారంభించిన సర్పంచ్ విక్రమ్.



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 12:**

ఈర్లపల్లి (శివగల్ల )నర్సింహా జ్ఞాపకార్థం వారి కుమారుడు శివగల్ల శ్రీనివాస్ ఇంద్రపాలనగరానికి గత 7 సంవత్సరాల క్రితం అందచేసిన స్వర్గపురిరథం గత రెండు సంవత్సరాలనుండి శితిలావస్థకు చేరుకోగా గ్రామ ప్రజల సౌకర్యార్థం గ్రామ సర్పంచ్ గర్థాస్ విక్రమ్ ధాత శ్రీనివాస్ చొరవ తీసుకొని సుమారు 1లక్ష 20 వేల రూపాయలతో రిపేర్ చేయించి మళ్ళీ వినియోగం లోకి తీసుకురావడం జరిగింది. కావున గ్రామ మరియు పరిసర ప్రాంత గ్రామ ప్రజలు నిర్వహణ ఖర్చులు చెల్లించి వినియోగించు కోగలరని మనవి.

## మృతురాలు కుటుంబానికి నివాళులు అర్పించిన సర్పంచ్ విక్రమ్




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 12:**

గ్రామం ఇంద్రపాలనగరం అకాల మరణం చెందినగాజుల అంతమ్మ మృతు దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన సర్పంచ్ గర్థాస్ విక్రమ్,మాజీ సర్పంచ్ కాటపల్లి యాదయ్య,యువనాయకులు సింగణబోయిన గణేష్యాదవ్ ,మందడి విధ్యాసాగర్ రెడ్డి, రాస వెంకటేశం,రాజన్నగారి రమేష్ సింగణబోయిన జంగయ్య, ఈర్లపల్లి మల్లయ్య,నిమ్మగడ్డ పద్మారావ్, నక్క వెంకటేష్, గర్థాస్ కరుణాకర్,గర్థాస్ స్వామి,బోనగిరి సంజీవ, కొమ్మగోని సంజీవ, చిన్నపాక సురేష్, కాటపల్లి మహేష్,బొల్ల నర్సింహా, బొల్ల నాగరాజు, బొల్ల మచ్చి,గోగికార్ రాజ్ కుమార్,బోనగిరి మధు, వెలిమినేటి సురేష్, వెలిమినేటి నరేష్, శ్రీరామ్ సంతోష్, నల్ల రాజు, గొళ్ళపెల్లి శంకరయ్య, బట్టు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వైద్య ఆరోగ్య శిబిరం



**గుండాల మార్చి 12.(వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున ప్రత్యేక ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గుండాల మండలంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించామని ఈ క్యాంపులో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, దంత వైద్యులు, కంటి వైద్యులు, చిన్నపిల్లల డాక్టర్, ఆర్తో నిపుణుల చే వైద్య ఆరోగ్య పరీక్షలు చేపించామని అన్నారు .ఈ కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ తేజ శ్రీ వేణి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వందన, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్ పెద్ది, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీజ, దంత వైద్య నిపుణులు డాక్టర్ ప్రసన్నలక్ష్మి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఏ కీర్తన ప్రత్యేక క్యాంపులో పాల్గొన్నారు.

# జహీరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

**- మంత్రి దామోదర్ రాజనర్సింహకు మున్సిపల్ చైర్మన్ విన్నపం...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 12:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ సమగ్ర అభివృద్ధికి సహకరించాలని కోరుతూ జహీరాబాద్ మున్సిపల్ ఛైర్మన్ యూనుస్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కోరారు. గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజా ప్రతినిధుల అవగాహన సదస్సు సందర్భంగా కోరారు పట్టణంలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా రహదారుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఛైర్మన్ మంత్రికి విన్నవించారు. జహీరాబాద్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యవసర పనుల నిమిత్తం నిధుల విడుదలకు చొరవ చూపాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ విన్నపంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే జహీరాబాద్ మున్సిపల్ పట్టణంలో ప్రత్యేక రివ్యూ మీటింగ్ (సమీక్షా సమావేశం) నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. పట్టణాభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపునకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు ఉన్నారు.

## ఏ. సి. బి. దాడులలో మోత్కూర్ ఎస్.టి. ఓ. ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ అరెస్ట్



**మోత్కూరు, మార్చి 12 ( వెలుతురు న్యూస్ );**

మోత్కూరు ఎస్. టి. ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఎ.ఎ.ఖదీర్ ఉద్యోగుల వేతనాలకు బిల్లులు చేయాలంటే లంచం లేనిదే పని లేదంటూ ఉద్యోగులను ఇబ్బందులను పెడుతున్నాడని అవినీతి అ పాల్పడుతున్నాడని ఖదీర్ ను, అదుపులో తీసుకొని అరెస్టు చేస్తున్నట్లు నల్లగొండ ఏ.సీ.బీ. డిఎస్పి జగదీష్ చందర్ తెలిపారు. గురువారం ఈ ఉద్యోగి చేస్తున్న అక్రమాలపై ఈ నెల 04 న గుండాల నుంచి మోత్కూరు కు డిప్యూటేషన్ పై చేస్తున్న ఎం.పి.ఓ జనార్ధన్ రెడ్డి 38 రోజుల బిల్లులు డ్రా చేయడానికి ఎస్.టి.వో ఆఫీస్ కి వెళ్తే తనకు డబ్బులు ఇస్తేనే బిల్లులు డ్రా చేస్తానని ఖదీర్ డబ్బులు డిమాండ్ చేయడంతో తాను ఫోన్ పే ద్వారా ట్రాన్స్ ఫర్ చేసినట్లు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. గుండాల మండలానికి చెందిన ఎంపీడీవో ఆఫీస్ లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ను ఇదే రీతిలో డబ్బులు అడిగితే వారు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథంలో ఖదీర్ అలర్ట్ అయ్యారని, ఈ లోపు ఖదీర్ అదుపులోకి తీసుకొని నాంపల్లి కోర్టుకు రిమాండ్ చేస్తున్నామన్నారు. ఖదీర్ స్వస్థలమైన భువనగిరిలోని వారింట్లో సోదాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేస్తే వారి పేరును గోప్యంగా ఉంచడంతోపాటు తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమకు ట్విట్టర్ లో కూడా ఖాతా ఉందని దాని ద్వారా కూడా ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. ఏసీబీ డీఎస్పీ నల్లగొండ రేంజ్ ఆధ్వరంలో ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

# చియా సీడ్ సాగులో జహీరాబాద్ రైతు విజయం

**కొత్త పంటలతో ఆదర్శంగా నిలుస్తున్న రమేష్ రెడ్డి...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 12:**

వ్యవసాయంలో కొత్త పంటలను ప్రవేశపెట్టి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన ప్రోగ్రెసివ్ రైతు, జహీరాబాద్ టౌన్2 బీజేపీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి బసంతాపూర్. ఇటీవల తన వ్యవసాయ క్షేత్రంలో చియా సీడ్ (సబ్జా) పంటను సాగు చేసి విజయాన్ని సాధించారు. తక్కువ ఖర్చుతో సాగు చేయగలిగే ఈ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఇప్పటికే రమేష్ రెడ్డి జహీరాబాద్ ప్రాంతంలో డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రోత్సహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆ సమయంలో ఆయన సాగు విధానం చూసి పలువురు రైతులు కూడా డ్రాగన్ ఫ్రూట్ సాగు ప్రారంభించి మంచి లాభాలు పొందారు. ఇప్పుడు అదే విధంగా మరో కొత్త ప్రయోగంగా చియా సీడ్ సాగు ప్రారంభించి విజయవంతంగా పండిస్తున్నారు. చియా సీడ్స్ ప్రస్తుతం ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలలో ముఖ్యమైన స్థానం పొందాయి. ఫైబర్, ప్రోటీన్, ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండటం వల్ల ఆరోగ్యాహారాలలో, పానీయాలలో చియా గింజలను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల మార్కెట్‌లో ఈ గింజలకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రైతులు సాంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న కొత్త పంటలను కూడా సాగు చేయాలని రమేష్ రెడ్డి సూచిస్తున్నారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగలిగే చియా పంట రైతులకు లాభదాయకంగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రమేష్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయోగాత్మక సాగు స్థానిక రైతుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే పలువురు రైతులు ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి చియా పంట సాగు విధానం గురించి తెలుసుకుంటున్నారు. రైతులకు లాభదాయకమైన కొత్త పంటలను పరిచయం చేయడంలో ఆయన చేస్తున్న ప్రయత్నాలను స్థానిక రైతులు అభినందిస్తున్నారు.





# రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వడం లేదని హరీష్ రావు విమర్శ

**- కోహీర్ దిగ్వాల్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మాజీ మంత్రి...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 12:**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు అసెంబ్లీలో పేర్కొంటున్నప్పటికీ, వాస్తవంగా రైతులకు కేవలం 12 గంటల విద్యుత్ మాత్రమే అందుతోందని మాజీ మంత్రి టి. హరీష్ రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంలోని 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కొనింటి మాణిక్ రావు, చింత ప్రభాకర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్‌లోని లాగ్ బుక్‌ను పరిశీలించిన హరీష్ రావు విద్యుత్ సరఫరా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోహీర్ మండల విద్యుత్ ఏఈ, లైన్‌మెన్‌లను విద్యుత్ సరఫరా పరిస్థితి, తరచూ జరుగుతున్న ట్రిప్పింగ్, లైన్ బ్రేకింగ్, ఎల్‌సీ కారణంగా ఏర్పడుతున్న అంతరాయాల గురించి ప్రశ్నించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వివరాలు కూడా తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, విద్యుత్ సరఫరా పలుమార్లు ట్రిప్ అవుతోందని, లైన్ బ్రేకింగ్ మరియు ఎల్‌సీ పేరుతో తరచూ అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ స్టేషన్ లాగ్ బుక్ ప్రకారం సాయంత్రం



4 గంటలకు త్రిఫేజ్ విద్యుత్ తీసేసి, తెల్లవారుజామున 3 గంటలకు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

అలాగే తమ ప్రభుత్వం హయాంలో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం రైతులు చెల్లించే డీడీ మొత్తం రూ.4,900 ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం దానిని రూ.9,700కు పెంచిందని విమర్శించారు. ఇది పూర్తిగా రైతు వ్యతిరేక చర్య అని అన్నారు. ప్రస్తుతం వేలాది కొత్త విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని, స్టోర్లలో అవసరమైన మెటీరియల్ కూడా అందుబాటులో లేదని పేర్కొన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో రైతులపైనే భారం మోపుతున్నారని, లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు డీటీఆర్‌లు కూడా ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. కొత్తగా గృహ విద్యుత్ కనెక్షన్లు కూడా ఇవ్వలేదని తెలిపారు.

ఇంకా బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలను మోసం చేయడానికి ప్రభుత్వం కొత్త డిస్కమ్ ఏర్పాటు చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న రెండు డిస్కమ్‌లపై



రూ.55 వేల కోట్లకు పైగా అప్పులు చేసి నష్టాల్లోకి నెట్టేశారని అన్నారు. గృహాలకు అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించిన బిల్లులను ఇప్పటివరకు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించలేదని కూడా వెల్లడించారు. అలాగే సమ్మె చేస్తున్న 19,647 మంది ఆర్టిజన్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్‌ల సమ్మెకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. విధుల్లో మరణించిన ఆర్టిజన్‌ల పిల్లలకు వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక రైతు సంక్షేమంపై కూడా హరీష్ రావు విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల్లో రైతులకు కేవలం రెండు సార్లు మాత్రమే రైతుబంధు పూర్తిగా ఇచ్చిందని, మరోసారి 3 ఎకరాల వరకు మాత్రమే చెల్లించిందని పేర్కొన్నారు. మొత్తం రూ.20 వేల కోట్ల రైతుబంధు బకాయిలు రైతులకు ఇవ్వకుండా ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపించారు. అలాగే రైతులకు ఇచ్చిన రుణమాఫీ కూడా కేవలం 60 శాతం రైతులకు మాత్రమే జరిగిందని అన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**- సీపీఎం నాయకుడు ఎస్. మహిపాల్...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 12:**

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు జీవనాధారంగా నిలుస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోందని సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు ఎస్. మహిపాల్ ఆరోపించారు. జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఎంతో మేలు చేస్తున్నప్పటికీ ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రెండు నెలలుగా కూలీలకు వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా కష్టాల్లో పడుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫేస్ క్యాప్చర్ ఆధారిత అటెండెన్స్ విధానం కారణంగా కూలీల హాజరు నమోదుకాకపోవడం జరుగుతోందని అన్నారు. దీంతో పని చేయడానికి వచ్చిన కూలీలు కూడా హాజరు పడక తిరిగి వెనక్కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో కూలీలు ఉపాధి హామీ పథకంపైనే ఆధారపడుతున్నారని, అలాంటి సమయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కూలీలను పనికి దూరం చేసేలా ఉన్నాయని విమర్శించారు. వెంటనే ఫేస్ క్యాప్చర్ అటెండెన్స్ విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే హాజరు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెండు నెలల కూలీ వేతనాలను వెంటనే చెల్లించాలని, లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యకర్త శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కించపరిచిన స్పీకర్

**- బి.ఆర్.ఎస్. పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి**

**మోత్కూర్, మార్చి 12,( వెలుతురు న్యూస్):**

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు 10 మంది పార్టీ ఫిరాయించడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు పిటీషన్ దాఖలైన విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని కోరారు. అందుకు బి.ఆర్.ఎస్. పార్టీ ఎమ్మెల్యేలు పదిమంది పార్టీ పిరాయించలేదని స్పీకర్ తీర్పు ఇవ్వడం ప్రజాస్వామ్య విరుద్ధమని టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ. స్పీకర్ నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు తప్పు పడుతున్నారనీ,10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారింది తెలంగాణ లోకమంతా చూసింది కానీ స్పీకర్ గారికి కనబడలేదు. దానం నాగేందర్ కు కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నుండి లోక్ సభకు ఎంపీ టికెట్ ఇచ్చింది. ఇది తెలియదా స్పీకర్ గారికి. కడియం శ్రీహరి కూతురు కాంగ్రెస్ ఎంపీ గా పోటీ చేయగా కడియం శ్రీహరి ప్రచార చేసింది తెలియదా స్పీకర్ గారికి. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం స్పీకర్ పదవికి ఆయన అనర్హుడు కాబట్టి వెంటనే తన పదవికి రాజీనామా చేసి సీఎం రేవంత్ రెడ్డికి భజనపరుడుగా ఉంటే ఎవరికి అభ్యంతరం లేదనీ,




నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వ పెద్దలు ఇకనైనా ఆత్మవిమర్శ చేసుకోవాలనీ విమర్శించారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ప్యానల్ ఇన్స్పెక్షన్ బృందం




**మోత్కూర్, మార్చి 12,( వెలుతురు న్యూస్ ):**

ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, మౌలిక సదుపాయాలను అంచనా వేయడానికి ప్రభుత్వము ఏర్పాటు చేసిన ప్యానెల్ ఇన్స్పెక్షన్ బృందము గురువారం మోత్కూరు మండలలోని మున్సిపాలిటీ పరిధిలో గాంధీనగర్, పద్మశాలి కాలనీ, కాశవారి గూడెం , ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా నోడల్ బృంద సభ్యులు వనం వెంకటేశ్వర్లు సత్తిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల పనితీరుపై ప్యానల్ ఇన్స్పెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు , పాఠశాల పరిసరాల పరిశుభ్రత, క్రీడలు, లైబ్రరీ నిర్వహణ, ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్, ఎఫ్ ఎల్ ఎన్, ఎఫ్ ఎల్ ఎస్ ,ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు , అలైన్మెంట్ పాటించాలని, ఉపాధ్యాయ సమీక్ష సమావేశం లు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు వనం వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్లు , పుష్పలత, పరమేశ్వరి, నర్సయ్య, సుధాకర్ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

**- అగ్నికి ఆహుతైన వాహనాలు**

**నిజామాబాద్,మార్చి12( వెలుతురు):**

నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గతంలో పోలీసులు సీజ్ చేసిన దాదాపు 50 బైకులు, ఆటోలు, కార్లు దగ్ధమయ్యాయి. చెత్తను తగలబెట్టడంతో వాహనాలకు నిప్పు అంటుకున్నట్లు సమాచారం. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేస్తున్నారు

# ఆరుట్ల గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం

**- దుకాణాల యజమానులు దుకాణాల ముందు పరిశుభ్రత పాటించాలి**

**- ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్, ఉపసర్పంచ్ నూకంవిజయ్ కుమార్ ముదిరాజ్**



**మంచాల వెలుతురు మార్చి 12:** మంచాల మండలం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతిప్రణాళిక99రో జుల కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆరుట్ల గ్రామపంచాయతీ పాలకమండలి గ్రామసర్పంచ్ మాలిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకం విజయ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి గ్రామంలోని పెద్దవ్యర్థాల ఉత్పత్తి దారులు దుకాణదారులు మాంసం చేపలు అమ్మే యజమానులతోవారి షాప్ లో మిగిలిన వ్యర్థ పదార్థాల పైన అవగాహన కల్పించడం జరిగింది ప్రతి దుకాణం ముందు పరిశుభ్రత పాటించాలని దుకాణాల యజమానులకు చెప్పడం జరిగింది కార్యక్రమంలోపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ వార్డుసభ్యులు సాతిరిసత్యం కొండిగారి శ్రావణ్ లాలగారి మణెమ్మ మరియు అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు మరియు గ్రామస్తులు తది తరులు పాల్గొన్నారు.

# నూతన వధువు వరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 12:** పట్టణ కేంద్రానికి చెందిన గంగాపురం యాదయ్య గౌడ్ కుమారుడి వివాహానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.రామన్నపేట మండలం తుమ్మలగూడెం (ఇంద్రపాలనగరం) గ్రామానికి చెందిన వరికుప్పల రమేష్ కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండి అమీర్ ఉప సర్పంచ్ చొప్పరి నరసింహ వార్డు మెంబర్ వరికుప్పల స్వామి నాయకులు జాల అమరేందర్ రెడ్డి, బొలుగుల కృష్ణ ,చెరుకు ఉపేందర్, అంతటి మల్లేశం, తదితరులు పాల్గొనడం జరిగింది.

# కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ని ప్రజా సమస్యలపై మర్యాదపూర్వకంగా కలిసిన కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్.



**కుత్బుల్లాపూర్ మార్చి 12 (వెలుతురు ప్రతినిధి):** నూతనంగా నియమితులైన కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ని జోనల్ కమిషనర్ ఆఫీసులో కుత్బుల్లాపూర్ జోన్ లోని 24 డివిజన్లలో నె ల కొ న్న టు వం టి సమస్యలు మరియు నూతనంగా చేపట్టవలసిన పనుల గురించి ఈరోజు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ కమిషనర్ ని కలిసి పలు వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ స్పందిస్తూ పలు సమస్యలపై సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ జోన్ లో చాలా సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నటువంటి పనులు మరియు నూతనంగా చేపట్టవలసిన పనుల గురించి కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామని తెలిపినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, ఐఎన్టియుసి నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, వివిధ కాలనీలా అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళా నాయకులు మున్సిపల్ అధికారులు మరియు స్థానిక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మౌలిక వసతుల పెంపుకు కృషి చేస్తా

**- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ మార్చి 12 (వెలుతురు ప్రతినిధి):** గురువారం 132 – జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ రంగారెడ్డి బండ ప్రాంతంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్ స్తంభాల మార్పు, భూగర్భ డ్రైనేజీ సామర్థ్యం పెంపు, మంజీరా నీటి పెంపు వంటి సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే కి విన్నవించారు.అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత 12 ఏళ్ల కాలంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలతో పాటు యాదిరెడ్డి బండ వంటి బస్తీలలో కూడా అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో కూడా మౌలిక వసతులను మరింత మెరుగుపరిచి అభివృద్ధి పరుస్తామన్నారు. అంతకముందు స్థానిక కట్టమైసమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీకాంత్, ఏఈ జ్ఞానేష్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సమావేశం

**- ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి పనిచేస్తే పేదల అభివృద్ధి సంక్షేమం సాధ్యమవుతుంది**

**- రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**





**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 12:** ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ రంగారెడ్డిజిల్లాకార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలె క్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లకు కౌన్సిలర్లకు ఉద్దేశించి ఏ ర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈసందర్భంగా రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్య తలు ఉన్నాయని ప్రజలతో మమేకమై పనులు చేసి నప్పుడే ప్రజలమన్ననలను పొందుతారని అన్నారు మున్సిపల్ పట్టణాలలో ప్రజలు అనేక సమస్యలతో ఉంటారని వారి సమస్యలను తె లుసుకొని వాటిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా విద్యతోనే మార్పువస్తుందని ప్రతిఒక్కరు చదువుకునేలా చూడాలని.మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు పారిశుధ్యంపై దృష్టి సారిం చాలనిమున్సిపాలిటీలను సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వేసవి దృష్ట్యా తాగు నీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందించాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ని ర్వహించే కార్యక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు అధికారు లందరూ కలిసి పనిచేసి అభివృద్ధి సంక్షేమాన్ని సాధించాలని కలిసికట్టుగా పనిచేస్తే ఇ దిసాధ్యమవుతుందని తెలిపారు అభివృద్ధితో పాటు రోడ్డు భద్రత యువత మత్తు పదార్థాల బా రిన పడకుండా ఉండడం తదితర సామాజిక అంశాలపై కూడాదృష్టి సాధించాలని తెలిపారు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.కె.శ్రీదేవి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మున్సి పల్ చైర్మన్లకు కౌన్సిలర్లకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం సంతోషమని నూతన ప్రజాప్రతి నిధులు ప్రజల్లో ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన తీసుకుని వెళ్లాలని ప్రజల కోసం పనిచేయా లని ప్రజాక్షేత్రంలో ఉండాలని పిలుపునిచ్చారు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్ర జా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అమలులో భాగంగా క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలకు మంచిసేవలు అందించేందు కు నూతనంగా ఎన్నికైన చైర్మన్లు కౌన్సిలర్లు దృష్టి సారించాలన్నారు జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని క్షేత్రస్థాయి కి వెళ్ళినప్పుడు ప్రజల సమస్యలు తెలుస్తాయని మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లుసమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చే యాలని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో మమేకమై ప్రజలకు సౌకర్యాలు సేవలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు ఉగాదికి సామూహిక ఇందిరమ్మగృహ ప్రవేశాల కా ర్యక్ర మానికి చర్యలు తీసుకోవాలని 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను షెడ్యూల్ ప్రకారం ముందు కు తీసుకెళ్లాలని అన్నారు ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి శాఖల ద్వారా అమ లు చేసే పలు ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీడి యోల ద్వారా మున్సిపల్ కౌన్సిల ర్లు, కార్పొరేటర్లకు అవగాహన కల్పించారుఈ సందర్భంగా ఆర్ కే వి వై కూర గాయల కిట్లు పంపిణీ చేశారు ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

**- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్.**







**కుత్బుల్లాపూర్ మార్చి 12 (వెలుతురు ప్రతినిధి):** గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 126 – జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్ట లోని ఇన్ఫాంట్ జీసస్ స్కూల్ లో ప్రీ ప్రైమరీ గ్రేడ్ విద్యార్థులకు నిర్వహించిన "గ్రాడ్యుయేషన్ డే" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు వారికి కొంత సమయాన్ని కేటాయిస్తూ ఉన్నట్లయితే వారికి తల్లిదండ్రులకు మధ్య సంబంధం, క్రమశిక్షణ, మంచి వాతావరణం మరింత పెంపొంది వారి భవిష్యత్తు ఉజ్వలంగా పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఏరువ బాల సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఎండి.ఆజం, బ్రహ్మానంద్ చారి, ఇందిరా గౌడ్, మెట్ల శ్రీను, ఖయూమ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 14 న జరిగే అంజన్న ఆశీర్వాద యాత్రకు తరలిరండి

**- ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులకు జేపీసీ చైర్మన్ చాడ ఆనంద్ పిలుపు...**



**కరీంనగర్ వెలుతురు మార్చి 12:** భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు , కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఈనెల 14న చేపట్టనున్న కొండగట్టు అంజన్న స్వామి ఆశీర్వాద పాదయాత్ర లో కార్మికులంతా పాల్గొనాలని ఉమ్మడి జిల్లా కార్మిక జేపీసీ చైర్మన్ చాడ ఆనంద్ కోరారు . ఈ మేరకు గురువారం రోజున చాడఆనంద్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు కరీంనగర్ చైతన్యపురి సమీపంలోని మహాశక్తి ఆలయం వద్ద నుండి ఘనంగా ప్రారంభమై కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వరకు జరుగుతున్న ఈ పాదయాత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర ద్వారా కార్మికుల ఐక్యత మరింత బలపడటంతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించి ప్రజా సమస్యలపై అవగాహన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులు పాదయాత్రకు మద్దతు తెలుపుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. కరీంనగర్ పట్టణంలో ఉన్న కార్మికులు మరియు కార్మిక సంఘాల నాయకులు ఉదయం మహాశక్తి ఆలయం వద్దకు చేరుకోవాలని, అలాగే మిగతా మండలాలు, గ్రామాలలో ఉన్న కార్మిక నాయకులు పాదయాత్రకు మార్గమధ్యంలో స్వాగతం పలుకుతూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేపీసీ చైర్మన్ చాడా ఆనంద్ ఈ ప్రకటనలో కోరారు.

# ఉపాధి హామీ కార్మికుల చెమట కు గౌరవం ఇవ్వాలి, పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి

**- భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్.**



**కరీంనగర్ వెలుతురు మార్చి 12:** కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కార్మికుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి బలమైన ఆధారం అయిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 125 రోజుల ఉపాధి హామీ ఇవ్వాలని ప్రభుత్వం చట్టబద్ధంగా నిర్ణయించింది.ఈ చట్టం వల్ల లక్షలాది మంది పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.కానీ ప్రస్తుతం ఉపాధి హామీ కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు.పని చేసిన తర్వాత కూడా వేతనాలు నెలల తరబడి రావడం లేదు.పని ప్రదేశాల్లో తాగునీరు,నీడ విశ్రాంతి స్థలం,ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సమయానికి రాకపోవడం వల్ల పనులు ఆగిపోతున్నాయి.అదే విధంగా ఫేస్ గుర్తింపు కోసం పని కి ముందు,తర్వాత ఫోటో తీసి అప్లోడ్ చేయడానికి సిగ్నల్స్,సాఫ్ట్వేర్ ప్రాబ్లం వల్ల ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. ముదురుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని వేసవి భత్యం కూడా ప్రతి కార్మికునికి కల్పించాలి.అదేవిధంగా 125 రోజులు పనిని కల్పించే ఆలోచన కింద ప్రభుత్వానికి ఉన్నట్లయితే దానికి కావలసిన బడ్జెట్ ను ఏర్పాటు చేయాలని,ఈ విషయాన్ని కేంద్ర మంత్రులు,పార్లమెంట్ సభ్యులు చర్చించి కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరడం జరిగింది.



# సైబరాబాద్ పోలీస్ కార్యాలయం పారిశ్రామిక భద్రతా సమన్వయ సమావేశం





**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 12, :** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేష్ రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు, సైబరాబాద్ పోలీస్ జీడిమెట్లలో పారిశ్రామిక భద్రతా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ప్రమాద రహిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి మరియు భద్రమైన పని వాతావరణాన్ని కల్పించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశారు.ఈసమావేశంలో ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, ఫ్యాక్టరీ యజమానులు, భద్రతా అధికారులు మరియు నిపుణులు సమావేశమై, సమర్థవంతమైన భద్రతా చర్యలను చర్చించారు. ఉత్తమ పద్ధతులను పంచుకున్నారు. మరియు స్టేక్‌హోల్డర్‌ల మధ్య సహకారాన్ని పెంపొందించారు. స్పష్టమైన అత్యవసర ప్రతిస్పందన ప్రణాళికలు, నియమ నిబంధనల పాటించడం మరియు బలమైన రిస్క్ మేనేజ్మెంట్ సిస్టమ్స్ యొక్క ప్రాముఖ్యత గురించి చర్చించారు.సైబరాబాద్ పోలీస్ తరపున డీసీపీ కుత్బుల్లాపూర్ జోన్ ఎన్ కోటి రెడ్డి IPS మాట్లాడుతూ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు మరియు ఉద్యోగుల మధ్య భద్రత ఒక ఉమ్మడి బాధ్యత అని నొక్కిచెప్పారు. సమర్థవంతమైన భద్రతా నిర్వహణకు సహకారం సమన్వయం కీలకమన్నారు.

ఈసమావేశంలో పీసీబీ EE రాజేందర్, TGIIC జోనల్ మేనేజర్ మధు, ఏసీపీ కుత్బుల్లాపూర్ బాల గంగిరెడ్డి, ఏడీ ఎలక్ట్రిసిటీ వీరేశం ప్రేమ్ కుమార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శేఖర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్ నితిన్, జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రంగా రాజు, IALA చైర్మన్ాణాచీ రాజు, హైడ్రా ఇన్స్పెక్టర్ వివిధ కంపెనీలకు చెందిన 250 మంది పారిశ్రామికవేత్తలు మరియు ఉద్యోగులు. ఎస్‌హెచ్‌ఓ జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ అన్ని శాఖలతో సమన్వయం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈసమావేశం భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భద్రతా కార్యక్రమాలలో పాల్గొనాలని జీడిమెట్లను సురక్షిత ప్రాంతంగా మారుద్దాం అని పిలుపునిచ్చింది.

# నిధుల విడుదలో నిర్లక్ష్యం

**- ఎమ్మెల్యేను నిలదీసిన సర్పంచ్‌లు**

**యాదాద్రి భువనగిరి,మార్చి12( వెలుతురు):** కాంగ్రెస్ పాలనపై ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధుల కేటాయింపులో పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారంటూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని బీఆర్ఎస్ సర్పంచులు నిలదీశారు.

భువనగిరిలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం రసాభాసగా జరిగింది. గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు చేయాలని భువనగిరి, వలిగొండ మండలాల బీఆర్ఎస్ సర్పంచులు ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకున్నారు.కాంగ్రెస్ సర్పంచ్ లకే నిధులు ఇస్తున్నారని ఆరోపించారు.తమకు ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.మహిళా భవనాలు, సీసీ రోడ్ల మంజూరు లో చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాజకీయాలు చేయవద్దని సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు.

# దేశంలో ఇంధన కొరత లేదు

నిరసనల మధ్యే తన ప్రకటన చేశారు. భారత్‌లో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ లభ్యతపై ఆందోళన నెలకొనడంతో కేంద్ర మంత్రి లోక్‌సభలో మాట్లాడారు. 'ఆధునిక ఇంధన చరిత్రలో ప్రపంచం ఇలాంటి క్లిష్ట సమయాన్ని మునుపెన్నడూ ఎదుర్కోలేదు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సురక్షితమైన సరఫరాలను సమకూర్చుకుంది. హర్మూజ్ సంక్షోభంతో భారత్‌కు సంబంధం లేదు. హర్మూజ్ జలసంధి భారత్‌కు తెరిచారు. ప్రధానమంత్రి చర్చలతో పరిస్థితులు సర్దుకుంటున్నాయి' అని హర్దీప్ సింగ్ తెలిపారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కొనేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి వివరించారు. సిలిండర్ల సరఫరాలో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25 రోజుల వ్యవధి, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎల్ఎన్‌జీ కార్గోలు దాదాపు ప్రతిరోజూ ప్రత్యామ్నాయ సరఫరా రూట్లలో ఇండియాకు వస్తున్నాయని తెలిపారు. ఒకవేళ ఘర్షణలు సుదీర్ఘకాలం కొనసాగినప్పటికీ తగినంత గ్యాస్ ఉత్పత్తి, సరఫరా ఏర్పాట్లు చేయగలిగే స్థితిలో ఇండియా ఉందని అన్నారు. గృహాలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. రిఫైనరీలకు తగిన ఆదేశాలు ఇవ్వడం ద్వారా గత ఐదు రోజులుగా 28 శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెరిగినట్టు హర్దీప్ సింగ్ పురి తెలిపారు. లక్షలాది భారతీయ కుటుంబాల వంటిళ్లలో ఎలాంటి కొరత లేకుండా చూసేందుకు మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, డొమిస్టిక్ సప్లయ్‌కు పూర్తి భరోసా ఉందని చెప్పారు. ప్రధాని మోదీ చర్చల వల్ల పరిస్థితులు సర్దుకుంటున్నాయి. పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ సరఫరాలో ఎలాంటి కొరత లేదు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. గృహ వినియోగ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు లేవు. 60 శాతం ఎల్పీజీని మనం గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. సిలిండర్ల సరఫరాలో ఆస్పత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25, గ్రామాల్లో 45 రోజుల గడువు విధించాం. ప్రపంచం ఇలాంటి ఇంధన సంక్షోభాన్ని ఎన్నడూ చూడలేదు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు. మంత్రి మాట్లాడుతుండగానే రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సభ నుంచి వెళ్లిపోయారు.

# తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

- నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మార్చి12 వెలుతురు:**
తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# కాశ్మీర్ మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

- తృటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి
- తనది 20 ఏళ్ల పగ అన్న దుండగుడు




**జమ్ము,మార్చి12 వెలుతురు:**
జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది. ఓ వివాహ వేడుకలో నిందితుడు ఆయనపై కాల్పులకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో.. ఫరూక్ సురక్షితంగా బయటపడ్డారు. 20 ఏళ్లుగా తాను ఫరూక్‌ను చంపాలనుకుంటున్నానని నిందితుడు పోలీసులతో పేర్కొన్నాడు. బుధవారం జమ్మూ శివార్లలోని హోటల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ చౌదరీ కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫరూక్‌పై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్నవారు వెంటనే అతడిని పట్టుకొని చితకబాదారు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్‌సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. జమ్మూలో దుకాణాలు నడుపుతోన్న కమల్ విచారణ సమయంలో కీలక విషయాలు వెల్లడించాడు. గత 20 ఏళ్లుగా తాను ఫరూక్ అబ్దుల్లాను చంపాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. ఇది తన వ్యక్తిగత అజెండాగా వెల్లడించాడు. కాల్పులకు ఉపయోగించిన తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు తెలిపాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. లోడ్ చేసిన తుపాకీతో తన తండ్రిని ఓ వ్యక్తి కాల్చేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అయితే, భద్రతా సిబ్బంది అప్రమత్తతతో అది విఫలమైందన్నారు. ఫరూక్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉన్న విషయాన్ని ఒమర్ ప్రస్తావించారు. ఇంత భద్రత ఉన్నా.. నిందితుడు అంత దగ్గరగా ఎలా రాగలిగాడని ప్రశ్నించారు. ఇక, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఉప ముఖ్యమంత్రి చౌదరి పేర్కొన్నారు.

# టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

**నల్లగొండ,మార్చి12( వెలుతురు):**
లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఎలైట్ ఆధ్వర్యంలో అద్దంకి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు అద్దంకి సునీల్ నల్లగొండ జిల్లా కేంద్రంలోని బాలికల వసతి గృహం ఏబీసీడీ క్యాంపస్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ నాయకులు మాట్లాడుతూ.. పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఎలైట్ సభ్యులు ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, రామకృష్ణ, అద్దంకి సునీల్, నల్లగొండ ఏఎస్‌డబ్ల్యూఓ స్వామి, హెచ్‌డబ్ల్యూఓస్ విజయలక్ష్మి, స్వప్న, దూసరి భారతమ్మ, తయాబా పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల శక్తి అపారం

- జయాపజయాలను ప్రభావితం చేయగలరు
- వాసవీ పారాయణం ప్రపంచ రికార్డు సృష్టించాలి







**హైదరాబాద్ వెలుతురు మార్చి 12:**
ఆర్యవైశ్యుల శక్తి అపారం..వారు తలచుకుంటే రాజకీయాలను , జయాపజయాలను ప్రభావితం చేయగలరని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వారు రాజకీయాల్లో ఎదగాలన్నారు.ప్రపంచ రికార్డు సృష్టించే స్థాయిలో ఆర్యవైశ్యులు వాసవి మాత పారాయణం చేయ తలపెట్టడం హర్షణీయమని అన్నారు. ఎల్బీ స్టేడియం దద్దరిల్లేలా నలభై వేల మందితో... భవిష్యత్తులో ఎవరూ చేయలేని విధంగా వాసవీమాత పారాయణం చేయాలన్నారు. ఆ రికార్డు కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానని తెలిపారు శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం పేరిట ఈనెల 22న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే సామూహిక పారాయణానికి సంబంధించి గురువారం బంజారా హిల్స్ పార్క్ హోటల్ కర్టెన్ రెయిజర్ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కల్వ సుజాత సంకల్పాన్ని కొనియాడారు. . శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం విజయవంతం కావాలని ఐ అండ్ పీ ఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఆకాంక్షించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కాల్వ సుజాత మాట్లాడుతూ 21,000 మందితో సామూహిక పారాయణానికి వైశ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అందుకు తగిన ఏర్పాటు చేశామని వెల్లడించారు ఈ పారాయణం ప్రపంచ రికార్డు కాబోతోందని అన్నారు. ప్రముఖ కవి చింతల శ్రీనివాస్ రచించిన 102 చరణాల వాసవీ మాత స్తుతి గీతాన్ని ఈ కార్యక్రమంలో ఆలపించారు. వాసవమ్మ జాతరకు తరలి రావాలంటూ ప్రముఖ జర్నలిస్ట్ , మఖన్లాల్ చతుర్వేది జర్నలిజం యూనివర్సిటీ బోర్డు మెంబర్ రావి కంటి శ్రీనివాస్ రచించి, దృశ్య రూపంలో చిత్రీకరించిన గీతాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా కొణిజేటి సుబ్బారావు , ఉప్పల శ్రీనివాస్ గుప్తా, చీకోటి ప్రవీణ్ , కాచం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. .

# వేతన బిల్లు మంజూరు లంచం

- ఎసిబికి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

**యాదాద్రి భువనగిరి,మార్చి12( వెలుతురు):**
ప్రభుత్వ ఉద్యోగికి రావలసిన వేతన బిల్లుల కోసం లంచం తీసుకున్న ట్రెజరీ సీనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఎండీ ఖదీర్ విడదల వారిగా ఫోన్ పే ద్వారా రూ. 15 వేలు లంచం తీసుకున్నాడు. అధికారి అవినీతిపై బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖదీర్ ఇంటిపై ఏసీబీ అధికారులు గురువారం మోత్కూర్‌లోని ఎస్‌టీవో కార్యాలయంపై దాడులు చేసి సోదాలు నిర్వహించారు. 38 రోజులకు సంబంధించిన వేతనం రూ. 1,09,384 కోసం బాధితుడు అధికారులను సంప్రదించగా తొలి విడతగా ఖదీర్ స్నేహితుడు సీనియర్ అసిస్టెంట్ నిరంజన్ అకౌంట్‌లోకి రూ.5 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించాడు.చివరి రెండు విడతలు ఖదీర్‌కు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. ఏసీబీ అధికారులు ఎస్‌టీవో సీనియర్ అసిస్టెంట్ ఖదీర్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

# మన విదేశాంగ విధానం అమెరికాకు తాకట్టు

- ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి
- ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు



**న్యూఢిల్లీ,మార్చి12 వెలుతురు:**
భారత విదేశాంగ విధానన్ని మోడీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా – ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా – ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హోర్ముజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రాన్ని నిలదీశారు. భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే రాహుల్ మైక్‌ను స్పీకర్ ఓం బిర్లా కట్ చేశారు. అంతలో సభలోని హర్దీప్ సింగ్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హర్దీప్‌సింగ్ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. అంతే కాకుండా ఎప్‌స్టీన్ అంటూ సభలో విపక్ష పార్టీల సభ్యులు బిగ్గరగా నినాదాలు చేశారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.

# అసెంబ్లీలో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు ప్రస్తావిస్తా

- ప్రభుత్వ తీరును ఎండగడతామన్న హరీష్ రావు



**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**
ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయలు, రిటైర్డ్ ఉద్యోగుల పై ముఖ్యమంత్రి కర్కశంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్‌రావు ఆరోపించారు. ఉద్యోగులకు రావలసిన హక్కులను వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం హరీష్ రావును కలిసి వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వ తీరు వల్ల బెనిఫిట్లు, పెన్షన్ బకాయిలు రాక మనోవేదనకు గురై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని , వందల సంఖ్యలో అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టబోమని, రిటైర్డ్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా అంటుందని, అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని భరోసా ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకపోవడానికి కారణం డబ్బులు లేక కాదు. ముఖ్యమంత్రికి మనసు రాక అని పేర్కొన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లక్షన్నర కోట్లు, ఫ్యూచర్ సిటీ కోసం లక్ష కోట్లు, అందాల పోటీల కోసం వందల కోట్లు, తన సోకుల కోసం నిర్వహించే ఫుట్‌బాల్ మ్యాచ్‌కు 100 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ కోసం వందల కోట్లు, వివిధ రాష్ట్రాల్లో వందల కోట్లతో పత్రిక ప్రకటనలు ఇచ్చే రేవంత్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించక పోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 98 వేల కోట్లకు టెండర్లు పిలిచారని, బడా కాంట్రాక్టర్లకు 40 వేల కోట్లు చెల్లించారని , కానీ ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాలు, బెనిఫిట్స్ కోసం మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కమిషన్లు రావు కాబట్టి వీరికి బకాయిలు చెల్లించడం లేదని దుయ్యబట్టారు. అసెంబ్లీ సమావేశాల్లో సమావేశాల్లో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు, చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.

# చిరంజీవిని కలసిన దిల్‌రాజు, ప్రియాంక


- గద్దర్ అవార్డుల ఫంక్షన్‌కు ఆహ్వానం



**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**
తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా మెగాస్టార్ చిరంజీవిని తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక కోరారు. అలాగే గద్దర్ అవార్డును స్వీకరించాల్సిందిగా అభ్యర్థించారు. గురువారం మెగాస్టార్ చిరంజీవి వీరు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక 'ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు' ను స్వీకరించాల్సిందిగా వారు చిరంజీవిని సాదరంగా ఆహ్వానించారు. మార్చి 19, హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఈ గౌరవాన్ని అందుకోవాలని వారు కోరారు.

# ఉద్యోగం వచ్చేవరకు భార్యకు చేదోడువాదోడు

- ఎక్సైజ్ సిఐగా ఎన్నికయ్యాక భర్తకు వేధింపులు
- భార్య వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య
- నేరెడ్ మెట్ పరిధిలో ఘటన..పోలీసులు దర్యాప్తు



**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**
భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన నగెల్లి శ్రీనివాస్(41) ఓ ప్రైవేట్ ఉద్యోగి. అతని స్వగ్రామం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్. శ్రీనివాస్ 2012లో జ్యోతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. భార్య గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు భర్త శ్రీనివాస్ చాలా హెల్ప్ చేశాడు. భర్త సహాయంతో జ్యోతి గ్రూప్స్‌లో విజయం సాధించి ఎక్సైజ్ సీఐగా నియమితులయ్యింది. ఉద్యోగం వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టడం స్టార్ట్ చేసింది. అంతే కాదు.. భర్తపై వరకట్నం వేధింపులు, విడాకుల కేసులు పెట్టింది. వేధింపులకు పాల్పడటంతో శ్రీనివాస్ తట్టుకోలేక పోయాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'భార్య వేధింపులు, కేసుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని సూసైడ్ నోట్ రాశాడు. శ్రీనివాస్ సోదరుడు శివకృష్ణ ఇంటికి వచ్చి చూడగా అతను మృతిచెందినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోదరుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ భార్య జ్యోతి సహా మరో 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అంబర్‌పేటలో కల్తీ పెరుగు స్వాధీనం



**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**
కల్తీ జాబితాలో పెరుగు కూడా చేరింది. నగరంలోని అంబర్‌పేటలో 2,500 కిలోల కల్తీ పెరుగును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాలలో కాస్టిక్ సోడా వినియోగించి పెరుగు తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. అంబర్‌పేట పోలీసులు, ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. పెరుగు శాంపిళ్లను ల్యాబ్‌కు పంపారు. పెరుగు తయారీదారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

# దండియాత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఉప్పు సత్యాగ్రహం

## - మహాత్మా గాంధీ నాయకత్వం మరియు కాంగ్రెస్ సేవాదళ్ వ్యవస్థీకృత పోరాటంపై సమగ్ర నివేదిక



**ప్రసన్న కుమార్ శర్మ**
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

*భారతదేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో 1930వ సంవత్సరంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహం లేదా దండి యాత్ర ఒక అద్వితీయమైన మరియు విప్లవాత్మకమైన ఘట్టం. ఇది కేవలం ఒక పన్నుకు వ్యతిరేకంగా జరిగిన నిరసన మాత్రమే కాదు, బ్రిటిష్ సామ్రాజ్యవాదపు నైతిక ప్రాతిపదికను సవాలు చేస్తూ, సామాన్య భారతీయుడి ఆత్మగౌరవాన్ని మేల్కొల్పిన మహోత్తర ఉద్యమం. మహాత్మా గాంధీ నేతృత్వంలో సాగిన ఈ పోరాటంలో అహింస అనేది ఒక శక్తివంతమైన వ్యూహాత్మక ఆయుధంగా రూపాంతరం చెందింది. అయితే, ఈ ఉద్యమ విజయం వెనుక ఉన్న ఒక అదృశ్య శక్తి, వ్యవస్థీకృత యంత్రాంగం 'కాంగ్రెస్ సేవాదళ్'. ఈ నివేదిక ఉప్పు సత్యాగ్రహం యొక్క చారిత్రక నేపథ్యాన్ని, గాంధీజీ వ్యూహాలను మరియు ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఈ ఉద్యమాన్ని విజయపథంలో నడిపించిన సేవాదళ్ వాలంటీర్ల అనితర సాధ్యమైన కృషిని విశ్లేషిస్తుంది.*



### రాజకీయ నేపథ్యం మరియు పూర్ణ స్వరాజ్ తీర్మానం

1920వ దశకం చివరలో భారతదేశంలో రాజకీయ పరిస్థితులు అత్యంత ఉత్కంఠభరితంగా మారాయి. 1928 నాటి సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమం దేశవ్యాప్తంగా జాతీయతా భావాన్ని రగిలించింది. అదే సమయంలో మోతీలాల్ నెహ్రూ సమర్పించిన 'నెహ్రూ రిపోర్ట్' భారతీయుల రాజ్యాంగ ఆకాంక్షలను ప్రతిబింబించింది. అయితే, బ్రిటిష్ ప్రభుత్వం భారతీయుల డిమాండ్లను నిర్లక్ష్యం చేయడంతో, కాంగ్రెస్ పార్టీ తన పంథాను మార్చుకుంది. 1929 డిసెంబర్ 31 అర్ధరాత్రి లాహోర్‌లో రావి నది ఒడ్డున జరిగిన చారిత్రాత్మక కాంగ్రెస్ సమావేశంలో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన 'పూర్ణ స్వరాజ్' లేదా సంపూర్ణ స్వాతంత్ర్యం తమ ఏకైక లక్ష్యమని ప్రకటించారు.
ఈ క్రమంలోనే 1930 జనవరి 26ను 'స్వాతంత్ర్య దినోత్సవం'గా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలనను అంతం చేసేందుకు శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రారంభించే బాధ్యతను కాంగ్రెస్ కార్యవర్గం గాంధీజీకి అప్పగించింది. గాంధీజీ ఈ ఉద్యమానికి ఒక శక్తివంతమైన చిహ్నాన్ని ఎంచుకోవాలని భావించారు. ఆ చిహ్నమే 'ఉప్పు'.

### ఉప్పు సత్యాగ్రహం - కీలక కాలక్రమం

#### తేదీ / కాలం

లాహోర్ కాంగ్రెస్ సమావేశం (పూర్ణ స్వరాజ్ ప్రకటన)
డిసెంబర్ 1929
మొదటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
జనవరి 26, 1930
గాంధీజీ వైస్రాయ్ ఇర్విన్‌కు 11 డిమాండ్లతో లేఖ రాయడం
మార్చి 2, 1930
దండి యాత్ర ప్రారంభం (సబర్మతి ఆశ్రమం నుండి)
మార్చి 12, 1930
దండి తీరం చేరుకోవడం
ఏప్రిల్ 5, 1930
ఉప్పు చట్టాల ఉల్లంఘన (ఉప్పు తయారీ)
ఏప్రిల్ 6, 1930
ధరసానా సత్యాగ్రహం మరియు పోలీసుల లాఠీఛార్జ్
మే 21, 1930
గాంధీ-ఇర్విన్ ఒప్పందం
మార్చి 1931

### ఉప్పు పన్ను:

#### ఆర్థిక దోపిడీ మరియు సామాజిక చిహ్నం

బ్రిటిష్ పాలకులు 1882 నాటి ఉప్పు చట్టం ద్వారా ఉప్పు ఉత్పత్తి మరియు అమ్మకంపై సంపూర్ణ గుత్తాధిపత్యాన్ని చెలాయించేవారు. సామాన్యులు తమ సొంత అవసరాల కోసం సముద్రపు నీటి నుండి ఉప్పు సేకరించడం కూడా నేరంగా పరిగణించబడేది. ఈ చట్టం వల్ల భారతీయులు తాము తయారు చేసుకోగలిగిన వస్తువును బ్రిటిష్ వారి నుండి అధిక పన్ను చెల్లించి కొనాల్సి వచ్చేది. ఉప్పు అనేది ధనిక, పేద, కుల, మత భేదం లేకుండా ప్రతి భారతీయుడికి ప్రాథమిక అవసరం కాబట్టి, దీనిపై పన్నును వ్యతిరేకించడం ద్వారా దేశంలోని అన్ని వర్గాలను ఏకం చేయవచ్చని గాంధీజీ భావించారు. ఇది బ్రిటిష్ ప్రభుత్వ అహంకారానికి మరియు అన్యాయానికి ఒక స్పష్టమైన ఉదాహరణగా నిలిచింది.

### కాంగ్రెస్ సేవాదళ్:

#### క్రమశిక్షణతో కూడిన అహింసా సైన్యం

ఉప్పు సత్యాగ్రహం వంటి సుదీర్ఘ పోరాటానికి కేవలం ఉద్వేగం మాత్రమే సరిపోదు, బలమైన సంస్థాగత నిర్మాణం కూడా అవసరం. ఈ అవసరాన్ని తీర్చిన వ్యవస్థే 'కాంగ్రెస్ సేవాదళ్'. సేవాదళ్ యొక్క ప్రాధాన్యతను గుర్తించిన జవహర్‌లాల్ నెహ్రూ దీనికి మొదటి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సంస్థ వాలంటీర్లకు శారీరక శిక్షణ, క్రమశిక్షణ మరియు గాంధేయ సిద్ధాంతాలపై లోతైన అవగాహన కల్పించేది. వీరు ధరించే తెల్లని గాంధీ టోపీ మరియు యూనిఫాం వీరికి ఒక ప్రత్యేక గుర్తింపును ఇచ్చాయి.
సేవాదళ్ స్థాపన మరియు డాక్టర్ హార్డికర్ నాయకత్వం
కాంగ్రెస్ సేవాదళ్ స్థాపన వెనుక డాక్టర్ నారాయణ సుబ్బారావు హార్డికర్ (N.S. Hardikar) కృషి అసామాన్యమైనది. వృత్తిరీత్యా వైద్యుడైన హార్డికర్, అమెరికాలోని మిచిగన్ విశ్వవిద్యాలయం నుండి పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. అక్కడ ఉన్నప్పుడు లాలా లజపత్ రాయ్ తో కలిసి పనిచేసి రాజకీయ చైతన్యం పొందారు.

### స్థాపన నేపథ్యం:

1923లో నాగ్‌పూర్‌లో జరిగిన ధ్వజ సత్యాగ్రహం (Flag Satyagraha) సమయంలో హార్డికర్ స్థాపించిన 'హుబ్లీ సేవా మండలి' కార్యకర్తలు జైలులో బ్రిటిష్ అధికారులకు క్షమాపణలు చెప్పడానికి నిరాకరించి, కఠినమైన క్రమశిక్షణను ప్రదర్శించారు. వీరి పట్టుదలను గమనించిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం, దేశవ్యాప్తంగా ఇటువంటి క్రమశిక్షణ గల వాలంటీర్ వ్యవస్థ అవసరమని గుర్తించింది.
దీని ఫలితంగా, 1923 డిసెంబర్‌లో జరిగిన కాకినాడ కాంగ్రెస్ సమావేశంలో డాక్టర్ హార్డికర్ నేతృత్వంలో ఒక బోర్డును ఏర్పాటు చేసి, 1924 జనవరి 1న 'హిందుస్థానీ సేవా మండల్' (తర్వాతి కాలంలో కాంగ్రెస్ సేవాదళ్)ను అధికారికంగా స్థాపించారు. జవహర్‌లాల్ నెహ్రూ ఈ సంస్థకు మొదటి అధ్యక్షుడిగా వ్యవహరించగా, హార్డికర్ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. మొదట్లో దీనిని ఒక 'మిలీషియా' తరహా సంస్థగా కొందరు కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించినప్పటికీ, నెహ్రూ మరియు గాంధీజీ మద్దతుతో ఇది అహింసా సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే క్రమశిక్షణ గల దళంగా ఎదిగింది.

### సేవాదళ్ ప్రధాన విభాగాలు

#### లక్ష్యాలు మరియు బాధ్యతలు

పురుషుల విభాగం
భద్రత, లాజిస్టిక్స్, సమాచార రవాణా మరియు ప్రత్యక్ష నిరసనలు
మహిళల విభాగం (స్త్రీ శక్తి)
ఉప్పు అమ్మకాలు, మద్యం మరియు విదేశీ వస్త్ర దుకాణాల వద్ద పికెటింగ్

### దండి యాత్ర:

#### 24 రోజుల మహా ప్రస్థానం

1930 మార్చి 12న ఉదయం 6:30 గంటలకు గాంధీజీ తన 78 మంది విశ్వసనీయ వాలంటీర్లతో కలిసి సబర్మతి ఆశ్రమం నుండి 240 మైళ్ల దూరంలో ఉన్న దండి గ్రామానికి యాత్ర ప్రారంభించారు. ఈ 78 మంది వాలంటీర్లను గాంధీజీ స్వయంగా ఎంపిక చేశారు. వీరిలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వారు, వివిధ మతాలకు చెందిన వారు ఉండటం విశేషం.

#### దండి యాత్రలో ప్రాంతీయ భాగస్వామ్యం (78 మందిలో)

##### వాలంటీర్ల సంఖ్య

గుజరాత్ 31, మహారాష్ట్ర 13, ఉత్తర ప్రదేశ్ 8, కచ్ 6, కేరళ 4, పంజాబ్ 3, రాజస్థాన్ 3, బొంబాయి 2, సింధ్ 1, నేపాల్ 1, తమిళనాడు 1, ఆంధ్ర 1 (సుబ్రహ్మణ్యం), ఒరిస్సా 1, కర్ణాటక 1, బీహార్ 1, బెంగాల్ 1
యాత్రలో సేవాదళ్ నిర్వహించిన పనులు యాత్ర సాగిన 24 రోజుల పాటు సేవాదళ్ వాలంటీర్లు పకడ్బందీగా పనిచేశారు:

#### 1 లాజిస్టిక్స్ మరియు ప్రణాళిక:

ప్రతిరోజూ 10 నుండి 15 మైళ్ల దూరం నడవాల్సి వచ్చేది. యాత్ర సాగే దారిలో ఏ గ్రామంలో భోజనం చేయాలి, ఎక్కడ నిద్రించాలి అనే అంశాలను సేవాదళ్ ముందుగానే సమన్వయం చేసేది.

#### 2. గ్రామీణ సమీకరణ:

యాత్ర గ్రామంలోకి ప్రవేశించడానికి ముందే వాలంటీర్లు అక్కడికి చేరుకుని ప్రజలను సమీకరించేవారు. గాంధీజీ సందేశాన్ని వివరించి, వారిని అహింసా పోరాటానికి సిద్ధం చేసేవారు.

#### 3. భద్రత:

వేలాది మంది ప్రజలు యాత్రలో పాల్గొంటున్నప్పుడు ఎటువంటి తొక్కిసలాట లేదా హింస జరగకుండా వాలంటీర్లు రక్షణ వలయాలుగా ఏర్పడేవారు.

#### 4. ఆరోగ్య సంరక్షణ:

తీవ్రమైన ఎండలో సుదీర్ఘ దూరం నడిచే సత్యాగ్రహులకు వైద్య సహాయం అందించేవారు.

#### 5. ఉప్పు తయారీ విధానం:

సత్యాగ్రహం యొక్క ఆచరణాత్మక రూపం
ఏప్రిల్ 5న దండి చేరుకున్న గాంధీజీ, ఏప్రిల్ 6న సముద్రపు నీటిని సేకరించి ప్రతీకాత్మకంగా ఉప్పును తయారు చేశారు. ఇది దేశవ్యాప్తంగా చట్ట ఉల్లంఘనకు పిలుపునిచ్చినట్లయింది.
ఉప్పు తయారీ ప్రక్రియ: సముద్ర తీరంలో గట్లు ఏర్పాటు చేసి నిల్వ చేసిన నీటిని పాత్రల్లో పోసి మరిగించి ఉప్పు తయారు చేసేవారు. ఈ ఉప్పును సేకరించి సేవాదళ్ వాలంటీర్లు చిన్న ప్యాకెట్లుగా చేసి ప్రజలకు విక్రయించేవారు. ఈ ఉప్పు విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును సత్యాగ్రహ శిబిరాల నిర్వహణకు ఉపయోగించేవారు.

#### 6. ధరసానా సత్యాగ్రహం:

అహింసా శక్తికి సజీవ సాక్ష్యం
గాంధీజీ అరెస్టు అయిన తర్వాత, మే 21న సరోజినీ నాయుడు నేతృత్వంలో సుమారు 2,500 మంది సేవాదళ్ వాలంటీర్లు ధరసానా వైపు కదిలారు. బ్రిటిష్ పోలీసులు ఇనుప అంచులతో కూడిన లాఠీలతో వాలంటీర్లపై విచక్షణారహితంగా దాడి చేసినప్పటికీ, వాలంటీర్లు అహింసను వీడకుండా దెబ్బలు తిన్నారు. ఈ ఘటనలో 320 మందికి పైగా గాయపడ్డారు, ఇద్దరు మరణించారు. ధరసానా సత్యాగ్రహం బ్రిటిష్ పాలన యొక్క నైతిక పతనాన్ని ప్రపంచ దేశాల ముందు ఎండగట్టింది.

#### 7. ప్రాంతీయ విస్తరణలో సేవాదళ్ పాత్ర

ఉప్పు సత్యాగ్రహం సేవాదళ్ మరియు ప్రాంతీయ నాయకుల సహకారంతో దేశం నలుమూలలా విస్తరించింది.

**ఆంధ్రప్రదేశ్:**

**మట్లపాలెం మరియు దేవరంపాడు**

ఆంధ్రలో టి. ప్రకాశం పంతులు (ఆంధ్ర కేసరి) మరియు పేరిచర్ల సుబ్బరాజు వంటి నాయకులు దీనికి నాయకత్వం వహించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మట్లపాలెంలో ఏప్రిల్ 11, 1930న ఉప్పు తయారీ ప్రారంభమైంది. ప్రకాశం జిల్లా దేవరంపాడు వద్ద కూడా సత్యాగ్రహం నిర్వహించబడింది, దీని జ్ఞాపకార్థం 1935లో రాజేంద్ర ప్రసాద్ 'విజయోత్సవ స్తూపాన్ని' ఆవిష్కరించారు.

**దక్షిణ భారతం:**

వేదారణ్యం యాత్ర తమిళనాడులో సి. రాజగోపాలాచారి (రాజాజీ) నాయకత్వంలో తిరుచిరాపల్లి నుండి వేదారణ్యం వరకు 150 మంది వాలంటీర్లు పాదయాత్ర నిర్వహించారు

**వాయువ్య సరిహద్దు:**

సరిహద్దు గాంధీ మరియు ఖుదాయ్ ఖిద్మత్గార్ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ స్థాపించిన 'ఖుదాయ్ ఖిద్మత్గార్' (దేవుని సేవకులు) సంస్థ ఉప్పు సత్యాగ్రహంలో వీరోచితంగా పోరాడింది. వీరిని 'రెడ్ షర్ట్స్' అని పిలిచేవారు. పెషావర్‌లోని కిస్సా ఖ్వానీ బజార్ వద్ద జరిగిన సత్యాగ్రహంలో బ్రిటిష్ వారు జరిపిన కాల్పుల్లో వందలాది మంది అహింసాయుత నిరసనకారులు మరణించారు.
కీలక వ్యక్తులు మరియు వారి సంస్థాగత బాధ్యతలు

#### 1. జమ్నాలాల్ బజాజ్:

సేవాదళ్‌కు ఆర్థిక వనరులను సమకూర్చడంలో మరియు వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడంలో బజాజ్ పాత్ర కీలకమైనది. ముంబైలోని విలే పార్లే సత్యాగ్రహ శిబిరానికి ఆయనే నాయకుడు.

#### 2. మహాదేవ్ దేశాయ్:

గాంధీజీ వ్యక్తిగత కార్యదర్శిగా యాత్రను రికార్డు చేశారు మరియు ధరసానా సత్యాగ్రహంలో వాలంటీర్లను నడిపారు.

#### 3. పురుషోత్తం గాంధీ:

సత్యాగ్రహ శిబిరాల నిర్వహణలో మరియు వాలంటీర్ల క్రమశిక్షణ, ఆహార పంపిణీ వంటి లాజిస్టిక్స్ అంశాలను పర్యవేక్షించేవారు.

### ముగింపు మరియు చారిత్రక వారసత్వం

ఉప్పు సత్యాగ్రహం 1931 మార్చిలో జరిగిన గాంధీ-ఇర్విన్ ఒప్పందంతో ముగిసింది. ఈ ఉద్యమం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం తీర ప్రాంత ప్రజలకు స్వంత వినియోగం కోసం ఉప్పు తయారు చేసుకునే హక్కును కల్పించడానికి అంగీకరించింది.
డాక్టర్ హార్డికర్ స్థాపించిన కాంగ్రెస్ సేవాదళ్ వాలంటీర్లు ప్రదర్శించిన క్రమశిక్షణ, అహింసా నిబద్ధత భారతదేశం యొక్క సామూహిక శక్తిని ప్రపంచానికి చాటాయి. సేవాదళ్ అనే వ్యవస్థీకృత శక్తి లేకపోతే, ఇంతటి భారీ స్థాయి ఉద్యమాన్ని అహింసాయుతంగా నిర్వహించడం అసాధ్యం అయ్యేది.
శాసనోల్లంఘన ఉద్యమ కాలంలో సేవాదళ్ క్రమశిక్షణ మరియు ఒక 'సమాంతర సైన్యం' (Peaceful Militia) లాగా అది ఎదుగుతున్న తీరును చూసి బ్రిటిష్ వారు భయపడ్డారు. ముఖ్యంగా సేవాదళ్ మహిళా విభాగాన్ని (Women's Army) ఏర్పాటు చేయడాన్ని సాకుగా చూపి, బ్రిటిష్ ప్రభుత్వం 1932లో సేవాదళ్‌పై నిషేధం విధించింది. 1934లో శాసనోల్లంఘన ఉద్యమం ముగిసిన తర్వాత కాంగ్రెస్ పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసినప్పటికీ, సేవాదళ్‌పై ఉన్న నిషేధాన్ని బ్రిటిష్ వారు అలాగే కొనసాగించారు.
సత్యాగ్రహం కోసం ప్రజలను సమీకరించడంలో ఈ సంస్థకు ఉన్న శక్తిని వారు గుర్తించడమే దీనికి ప్రధాన కారణం.
స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి సంవత్సరం, అంటే 1948లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కాంగ్రెస్ సేవాదళ్‌ను నిషేధించింది. అయితే, సేవాదళ్ స్థాపనలో కీలక పాత్ర పోషించి, ఒకప్పుడు ఆ సంస్థకు అధ్యక్షుడిగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ అప్పటికే భారత ప్రధానమంత్రిగా ఉన్నారు. అసాధారణ పరిస్థితుల్లో తప్ప ఇటువంటి ప్రజాస్వామ్య సంస్థలపై నిషేధాలు ఉండకూడదనే సూత్రంపై ఆయన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, సేవాదళ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయించారు. దీనితో సేవాదళ్ మళ్ళీ తన కార్యకలాపాలను స్వేచ్ఛగా కొనసాగించే అవకాశం లభించింది.
నేటికీ, సేవాదళ్ వాలంటీర్లు ధరించే తెల్లని టోపీ ఆనాటి త్యాగాలకు మరియు అహింసా పోరాట పటిమకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

# కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్

**- లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్**
**- హాజరైన సినీ, రాజకీయ దిగ్గజనేతలు**





**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**
హైదరాబాద్ కోకాపేటలోని 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రికి నటుడు అల్లు అర్జున్ స్వాగతం పలికారు. మల్టీప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళు లర్పించారు. 'అల్లు సినిమాస్'లోని ఏర్పాట్లను అల్లు అరవింద్, అల్లు అర్జున్ వివరించారు. అనంతరం డాల్బీ స్క్రీన్‌లో ప్రదర్శించిన పలు ప్రచార చిత్రాలను వీక్షించారు. ఈ ఈవెంట్‌లో దర్శకులు రాఘవేంద్రరావు, బోయపాటి శ్రీను, క్రిష్, నందినిరెడ్డి, పలువురు నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు. 'అల్లు సినిమాస్'లో నాలుగు స్క్రీన్లు ఉండగా.. స్క్రీన్-1లో డాల్బీ విజన్ సౌలభ్యం ఉంది. ఇది ఆసియాలోనే అతి పెద్దదిగా 75 అడుగులు ఉంటుంది. ఉగాది సందర్భంగా ఈ మల్టీప్లెక్స్‌లో సినిమాలు ప్రదర్శన ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి 'బుక్ మై షో' వేదికగా బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి. 'ధురంధర్: ది రివెంజ్' మూవీ ప్రీమియర్స్‌తో ప్రేక్షకులకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.అంతకుముందు గురువారం సాయంత్రం ఈ వేడుక సినీ, రాజకీయ నాయకుల సమక్షంలో గ్రాండ్ గా జరిగింది.

# శరవేగంగా హైకోర్టు నిర్మాణ పనులు

**- పనులను పరిశీలించిన చీఫ్ జస్టిస్**

**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో ప్రతిష్టాత్మకంగా హైకోర్టు భవన సముదాయం నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో భాగంగా జోన్-ఎలో 40 ఎకరాల విస్తీర్ణంలో ఇన్‌స్టిట్యూషనల్ భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అదే విధంగా జోన్-ఎఎలో సుమారు 60 ఎకరాల భూమిని గౌరవ ముఖ్య న్యాయమూర్తి ,మరియు న్యాయమూర్తుల కోసం అవసరమైన సౌకర్యాలతో కూడిన నివాస విల్లాల నిర్మాణానికి కేటాయించారు. ఈ నివాస విల్లాల నిర్మాణానికి ఏప్రిల్ 5న భూమిపూజ కార్యక్రమం నిర్వహించాలని న్యాయవ్యవస్థ అధికారులు నిర్ణయించారు. నేపథ్యంలో గురువారం గౌరవ ముఖ్య న్యాయమూర్తి ఆపరేష్ కుమార్ సింగ్ , గౌరవ



న్యాయమూర్తులు మరియు రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ కలిసి నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రోడ్లు-భవనాల శాఖ అధికారులకు సూచించారు. అలాగే పనులు వేగంగా ముందుకు సాగేందుకు కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులతో కలిసి సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# 16నుంచి ఒంటిపూట బడులు

**- ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ**

**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మార్చి 16 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం వడ్డించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. టెన్త్ ఎగ్జామ్స్ జరిగే స్కూళ్లలో షెడ్యూల్ మారుతుంది. అక్కడ మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా యధావిధిగా ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఉండనున్నాయి. తిరిగి 2026-27 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

# ఆరులక్షల టన్నలు యూరియా కేటాయించండి

**- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ**

**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**
ఈ ఏడాది ఖరీఫ్ కోసం ముందస్తుగా యూరియా నిల్వలు సిద్ధం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది ఈ నేపథ్యంలో రానున్న మూడు నెలలకు.. ఆరు లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఏప్రిల్, మే, జూన్‌కు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాద్‌లో వెల్లడించారు. ఖరీఫ్ ప్రారంభానికి రాష్ట్రంలో సుమారు 50 వేల టన్నుల ప్రారంభ నిల్వలు మాత్రమే ఉండే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగవుతాయని మంత్రి తుమ్మల వివరించారు. జులై, ఆగస్టులలో యూరియా డిమాండ్ గరిష్ఠంగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. నెలకు సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమవుతుందని తెలిపారు. ఎరువుల పంపిణీ పారదర్శకతకు యూరియా యాప్ తీసుకొచ్చినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు.

# జనరల్ వార్తలు

# మళ్లీ స్టాలినే...

**- విజయ్ ప్రభావం నామమాత్రమే అంటున్న సర్వేలు**



**చెన్నై, మార్చి12 ( వెలుతురు):**
2024 సార్వత్రిక ఎన్నికలలో కూటమి సాధించిన విజయం ఒక చరిత్ర. దాదాపుగా 58 శాతం ఓటింగ్ తో తిరుగులేని మెజారిటీ తో ఈ ఎన్నికల్లో గెలిచింది. జనసేన పార్టీ అయితే నూటికి నూరు శాతం పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలిచి హిస్టరీ క్రియేట్ చేసింది. 164 స్థానాలతో సీఎం గా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. అయితే వీళ్లకు ఈ రేంజ్ విజయం లభిస్తుందని ఎగ్జిట్ పోల్స్ పూర్తి అయిన రోజులకు కేకే అనే పొలిటికల్ అనలిస్ట్ చెప్పడం అప్పట్లో హాట్ టాపిక్ అయ్యింది. మొదట్లో ఎవ్వరూ ఈ సర్వే ని నమ్మలేదు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పుడు ఆయన చెప్పినది తూచా తప్పకుండ జరగడంతో ఒక్కసారిగా అందరూ షాక్ కి గురయ్యారు. 'కేకే సర్వేస్' పేరు నేషనల్ లెవెల్ లో మారుమోగిపోయింది.అయితే ఈయన త్వరలోనే తమిళనాడు లో జరగబోతున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తన టీం తో సర్వే ని నిర్వహించగా, ఆ ఫలితాలను నేడు తెలిపాడు. ఆయన చెప్తున్న లెక్కల ప్రకారం చూస్తే , ప్రస్తుతం అధికారం లో ఉన్న డీఎంకే మరోసారి 41.5 శాతం ఓటింగ్ తో అధికారం లోకి రాబోతుందని తెలుస్తోంది. అదే విధంగా అన్నా డీఎంకే పార్టీ కి 36.2 శాతం ఓటింగ్ వస్తుందని చెప్పుకొచ్చాడు. ఇక తమిళనాడు లో సూపర్ స్టార్ గా ఒక వెలుగు వెలుగుతున్న సమయంలోనే సినిమాలకు గుడ్ బై చెప్పి రాజకీయాల్లోకి టీవీకే పార్టీ ద్వారా ఎంట్రీ ఇచ్చిన విజయ్ కి 13.6 శాతం ఓటింగ్ వచ్చే అవకాశం ఉందని , అదే విధంగా పార్టీ కి 7.9 ఓటింగ్ వస్తుందని చెప్పుకొచ్చాడు . ఈ సర్వే ని బూత్ స్థాయి అంచనాలతో శాస్త్రీయ పరిశోధన పద్ధతులతో చేపట్టినట్టు కేకే చెప్పుకొచ్చాడు.అయితే విజయ్ పార్టీ కి మొదటి ఎన్నికల్లోనే డబుల్ డిజిట్ ఓటింగ్ శాతం నమోదు అవ్వడబోతుండడం అనేది చిన్న విషయం కాదు. మెగాస్టార్ చిరంజీవి తర్వాత రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఏ సూపర్ స్టార్ పార్టీ కి కూడా డబుల్ డిజిట్ ఓటింగ్ రాలేదు. అలాంటిది విజయ్ కి ఆ రేంజ్ ఓటింగ్ ఉండడం అనేది ఆ పార్టీ కి శుభ పరిణామమే. అయితే రీసెంట్ గా విజయ్ చుట్టూ జరిగిన కొన్ని సంఘటనలు ఆయన ఓటింగ్ పై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని కేకే చెప్పుకొచ్చాడు. చూడాలి మరి రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతుంది అనేది.

# కొత్త ప్రభుత్వం..స్నేహగీతం

**ఢాకా, మార్చి12 ( వెలుతురు):**
బంగ్లాదేశ్‌లో పరిస్థితులు మారుతున్నాయి. భారత వ్యతిరేకత క్రమంగా తగ్గుతోంది. భారత్‌తో సఖ్యతగా ఉంటూ కలిసి పనిచేయకుంటే ఇబ్బందని కొత్త ప్రభుత్వం భావిస్తోంది. మహ్మద్ యూనస్ పాలించిన 18 నెలల పాలన నెమ్మదిగా మారుతోంది. బంగ్లాదేశ్ అంతర్గత అవసరాలు, గల్ఫ్ యుద్ధం వల్ల కలిగిన పరిస్థితుల కారణంగా బంగ్లాదేశ్‌లో మార్పు కనిపనిస్తోంది.డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఇంటలిజెన్స్ మేజర్ జనరల్ కైసర్ రసూల్ చౌదరి హాఫీజు ఉర్ రహ్మాన్ ఇటీవల భారత్‌కు వచ్చి రా చీఫ్ పరాగ్ జైన్, లెఫ్టినెంట్ జనరల్ ఆర్ఎస్ రమణ్‌లతో సమావేశమయ్యారు. చర్చల వివరాలు బయటపడలేదు. ఇది రక్షణ, ఇన్‌టెలిజెన్స్ సహకారానికి సూచిక.బంగ్లా ఆర్మీలో జమాతే ఇస్లామ్ ప్రభావాన్ని తొలగించేందుకు యూనస్ అనుకూలులను రిటైర్ చేశారు. పోలీస్ విభాగాన్ని పునరుద్ధరిస్తున్నారు. జమాత్ అల్లర్లలో 3,500 మంది పోలీసుల సజీవ దహనానికి విచారణ జరుగనుంది. దీంతో మహ్మద్ యూనిస్, జమాతే ఇస్లామ్ అనుకూలులు ఆందోళన చెందుతున్నారు.ఐఎస్ఐ ఏజెంట్ల చొరబాటు, హిందువులపై దాడులు తగ్గుతున్నాయి. లా అండ్ ఆర్డర్ క్రమబద్ధీకరణకు చర్యలు. ఉస్మాన్ హాదీ హత్య కారకులు బెంగాల్‌లో పట్టుబడ్డారు. వారిని భారత్ బంగ్లాదేశ్‌కు అప్పగించింది. ఈ హత్య వెనుక మహ్మద్‌యూనస్ ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఎన్నికలు వాయిదా వేయడానికి ఈ హత్య చేయించినట్లు సమాచారం.గల్ఫ్ యుద్ధం చమురు సరఫరాను ఆపేసింది. ఆర్మూజ్ జలసంధి మూసుకుపోయింది. బంగ్లాదేశ్‌లో చమురు నిల్వలు అడుగంటాయి. దీంతో దిక్కుతోచని స్థితి నెలకొంఆది. దీంతో బంగ్లాదేశ్ 1.8 లక్షల టన్నుల డీజిల్ సహాయం భారత్‌ను కోరింది. గల్ఫ్‌లో పనిచేసే బంగ్లాదేశీయుల డబ్బు ఆగిపోయింది.కొత్త ప్రభుత్వం భారత్‌తో సఖ్యతే మంచిదని భావిస్తోంది. పాక్ అనుకూల ఎలిమెంట్స్ ఏర్పడే అవకాశం. యూనస్ తప్పుల సరిదిద్దేందుకు చర్యలు. ఆర్థిక సహాయం, రక్షణ సహకారంతో రిలేషన్స్ మెరుగుపడతాయి.

# ఇంటర్నెట్ పై ట్యాక్స్...




**హైదరాబాద్, మార్చి12 ( వెలుతురు):**
స్మార్ట్‌ఫోన్ యూజర్లు, ఇంటర్నెట్ ప్రియులకు కేంద్ర ప్రభుత్వం పెద్ద షాక్ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ఇంటర్నెట్ డేటా వాడకంపై కొత్తగా ట్యాక్స్ వేసే ఆలోచనలో కేంద్ర సర్కార్ ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. జనవరి నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన టెలికాం రివ్యూ మీటింగ్‌లో ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ప్రజల్లో స్క్రీన్ అడిక్షన్‌ను తగ్గించాడానికి ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఒక అంచనా ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో 229 బిలియన్ జీబీల డేటాను జనాలు వాడేశారు. ఈ లెక్కన ప్రతి జీబీ వాడకంపై ఒక్క రూపాయి చొప్పున ట్యాక్స్ వేసినా.. ఏటా ప్రభుత్వ ఖజానాకు దాదాపు 22 వేల 900 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ప్రస్తుతం టెలికాం సేవలపై 18 శాతం ఉూ కడుతున్నాం. ఈ కొత్త ట్యాక్స్ వస్తే అది సామాన్యుల జేబులకు అదనపు భారం కానుంది. ఒక నిర్దిష్ట డేటా లిమిట్ దాటిన తర్వాతే ఈ ట్యాక్స్ పడుతుందనే ప్రచారం జరుగుతున్నా..అలాంటి స్లాబ్ సిస్టమ్‌పై ఇంకా ఎలాంటి క్లారిటీ లేదు. అసలు ఈ ట్యాక్స్ అమలు ఎంతవరకు సాధ్యం అన్నదానిపై సాధ్యాసాధ్యాలను స్టడీ చేయాలని టెలికాం డిపార్ట్‌మెంట్‌ను కేంద్రం ఆదేశించింది. ఈ ట్యాక్స్ వసూలు విధానంపై సెప్టెంబర్ 2026 నాటికి టెలికాం శాఖ..ప్రభుత్వానికి పూర్తి స్థాయి రిపోర్ట్ ఇవ్వనుంది.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

**- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి.**

**రంగారెడ్డి మార్చి12( వెలుతురు):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారం గ్రామంలోని వర్ధమాన ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్యతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొనీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా సర్పంచులు గా ఎన్నికైన అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన మీరంతా మీ సమయాన్ని వృథా చేయకుండా గ్రామాభివృద్ధికి సమయాన్ని వెచ్చించాలని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేసేలా ఎక్కడ ఎలాంటి వైరుధ్యాలు



లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. 99 రోజుల పాటు పది అంశాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ఇందులో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు కీలకంగా ఉండాల్సినందున వారికి సమగ్రంగా అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్, అధికారులు నివృతి చేస్తారన్నారు. 99 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించి వారిని పథకాల అమలులో భాగస్వాములను చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందజేసేందుకు తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ID కార్డులను, 99 రోజుల ప్రణాళిక బుక్స్ అందజేయడం జరిగింది. అనంతరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా అధికారులు, మండలాల అధికారులు, సర్పంచులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుంది

**- రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా మార్చి12( వెలుతురు):**
ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్యతలు ఉన్నాయని, ప్రజలతో మమేకమై పనులు చేసినప్పుడే ప్రజల మన్ననలను పొందుతారని అన్నారు. మున్సిపల్ పట్టణాలలో ప్రజలు అనేక సమస్యలతో ఉంటారని, వారి సమస్యలను తెలుసుకొని వాటిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా విద్యతోనే మార్పు



వస్తుందని ప్రతి ఒక్కరు చదువుకునేలా చూడాలని, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పారిశుధ్యం పై దృష్టి సారించాలని, మున్సిపాలిటీలను సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ,వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందించాలని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పనిచేసి అభివృద్ధి, సంక్షేమాన్ని సాధించాలని కలిసికట్టుగా పనిచేస్తే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. అభివృద్ధితో పాటు, రోడ్డు భద్రత ,యువత మత్తుపదార్థాల బారిన పడకుండా ఉండడం, తదితర సామాజిక అంశాలపై కూడా దృష్టి సాధించాలని తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.కె.శ్రీదేవి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం సంతోషమని, నూతన ప్రజాప్రతినిధులు ప్రజల్లో ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన తీసుకుని వెళ్లాలని, ప్రజల కోసం పనిచేయాలని, ప్రజాక్షేత్రంలో ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అమలులో భాగంగా క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, కౌన్సిలర్లు దృష్టి సారించాలన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు ప్రజల సమస్యలు తెలుస్తాయని, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మమేకమై ప్రజలకు సౌకర్యాలు, సేవలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉగాదికి సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను షెడ్యూల్ ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి శాఖల ద్వారా అమలు చేసే పలు ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, వీడియోల ద్వారా మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా =ఖవ్ కూరగాయల కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హార్మోజ్ జలసంధి మూసే ఉంచుతాం

- **అమెరికాపై ప్రతీకార దాడులు ఆగవు**
- **పొరుగుదేశాలు అమెరికా స్థావరాలు మూసేయాలి**
- **ఇరాన్ కొత్తనేత మొజ్తబా ఖమేనీ తొలి ప్రకటన**
- **ప్రసారం చేసిన ఇరాన్ టెలివిజన్**

**టెహ్రాన్, మార్చి12( వెలుతురు):**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చిన వేళ ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సంచలన ప్రకటన విడుదల చేశారు. హోర్ముజ్ జలసంధిని మూసే ఉంచుతామని అన్నారు. హోర్ముజ్ జలసంధి మూసివేతను తన తండ్రి అయతొల్లా అల్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా-ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెంచే చర్యగా అభివర్ణించారు. ఆయన ప్రకటనను ఇరాన్ టెలివిజన్ ప్రసారం చేసింది. మొజ్తాబా మాత్రం కెమెరా ముందుకు రాలేదు. ఇరాన్ సుప్రీం నేతగా ఎన్నికైన తర్వాత ఆయన అధికారిక ప్రకటన విడుదల చేయడం ఇదే మొదటిసారి. మధ్యప్రాచ్యంలో శత్రులక్ష్యాలపై దాడులు కొనసాగిస్తామని కూడా మొజ్తాబా హెచ్చరించారు. అమెరికా స్థావరాలను మూసివేయాలని ఆయా దేశాలకు పిలుపునిచ్చారు. లేనిపక్షంలో దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ప్రజలు చిందించిన రక్తం, ముఖ్యంగా మినాబ్‌లో జరిగిన పాఠశాల బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలకు ప్రతీకారం తీర్చుకునే విషయంలో వెనుకంజ



వేసేది లేదన్నారు. యుద్ధంలో శత్రువులు కలిగించిన నష్టానికి ఇరాన్ పరిహారం కోరుతోందని మొజ్తాబా అన్నారు. పరిహారం చెల్లించని పక్షంలో అంతే మొత్తాన్ని వాళ్ల ఆస్తుల నుంచి తీసుకుంటుందని, అది సాధ్యం కాకుంటే అంతే మొత్తంలో ఆస్తులకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత కష్టకాలంలో దేశంలోని ప్రజలు, సంస్థలు కలిసికట్టుగా ఉండాలని, అమెరికా చెబుతున్న అబద్దాలను తిప్పికొట్టాలని, జాతీయ సమైక్యతను చాటుకోవాలని కోరారు. ఇరాన్ అమరవీరుల ప్రతీకారం తీర్చుకుంటామని మెజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలను మూసివేయాలని పిలుపునిచ్చారు.గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో అమెరికా, హోర్ముజ్ జలసంధిపై కఠినమైన వైఖరిని ప్రస్తావించారు. 'ఈ ప్రాంతంలోని అన్ని అమెరికా స్థావరాలను వెంటనే మూసివేయాలి, లేకపోతే వాటిపై దాడి కొనసాగుతుంది' అని హెచ్చరించారు. కాగా, దాడుల్లో గాయపడి ఇప్పటి వరకు బయటకు కనిపించని సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ఒక ప్రెజెంటర్ వినిపించారు. హోర్ముజ్ జలసంధి మూసివేత కొనసాగించాలని ఒక లెవరేజ్ సాధనంగా అది ఉండాలని ఆయన అన్నారు. పొరుగు దేశాల పట్ల ఇరాన్ విధానం సహకారంగా ఉంటుందని చెప్పడానికి ప్రయత్నించారు. 'ప్రాంతీయ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలకు ఇరాన్ మద్దతు ఇస్తుంది. కానీ అమెరికన్ దళాలకు ఆతిథ్యం ఇవ్వకుండా వారిని హెచ్చరిస్తుంది' అని పేర్కొన్నారు.మరోవైపు ఇరానియన్ల రక్తానికి ప్రతీకారం తీర్చుకోవడానికి తాము వెనుకాడబోమని మోజ్తాబా ఖమేనీ స్పష్టం చేశారు. స్కూల్‌పై క్షిపణి దాడిలో సుమారు 110 మంది పిల్లలతో సహా168 మంది మరణించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పోరాటాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే లెబనాన్, ఇరాక్, యెమెన్‌తో సహా ఈ ప్రాంతంలోని మిత్ర సాయుధ సమూహాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ హతమయ్యారు. ఈ దాడుల్లో గాయపడిన ఆయన కుమారుడైన మోజ్తాబా ఖమేనీ తన తండ్రి అధికారాన్ని దక్కించుకున్నారు.

## ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం

- **ఇప్పటికే ఇరాన్‌తో మంత్రి జైశంకర్ చర్చలు**
- **విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్**

**న్యూఢిల్లీ,మార్చి12( వెలుతురు):**
ఇంధన భద్రతపై ఇరాన్‌తో చర్చిస్తున్నాం విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. దేశ ఇంధన భద్రతపై ఇరాన్‌తో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మాట్లాడారని రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. హర్మూజ్ మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి కూడా చర్చించినట్లు తెలిపారు. మరోవైపు, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, దానిని



పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శ్రీలంక, మాల్దీవుల నుంచీ ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం ఇరాన్‌లో దాదాపు తొమ్మిది వేల మంది భారతీయులు ఉన్నారని.. వీరిలో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఘర్షణ మొదలైన వెంటనే విద్యార్థులు సహా అనేక మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉందన్నారు. అఫ్గాన్‌తో ఇటీవల ఘర్షణకు భారత్ కారణమంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగశాఖ ఖండించింది. అవి నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు పరిపాటేనని విమర్శించింది. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం మాటలకు విశ్వసనీయత లేదని తెలిపింది.

## రాష్ట్రంలో ఆగమయిన వ్యవసాయం

**- జగదీష్ రెడ్డి**

**నల్గొండ మార్చి12 ( వెలుతురు):**
దేవరకొండ లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సమక్షంలో,కాంగ్రెస్ మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య తో పాటు 400 కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరారు. జగదీష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది.. కేవలం పోలీస్ శాఖ మాత్రమే పని చేస్తోంది. అది కుడా కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా పని చేస్తున్నది. జిల్లాలో ఇద్దరు మంత్రుల ఉన్న శుద్ధ దండగ. సాగర్ కింద, ఎస్ఎల్బీసీ కింద నీళ్లు ఇవ్వలేని చావ లేని ,సత్తా లేని మంత్రులు వీళ్లు.. డిండి పాలమూరు రంగరెడ్డి ఎత్తిపోతల పథకంలో కూడా నల్గొండ కి నీళ్లు రాకుండా పెద్ద కుట్ర జరుగుతోంది.. అయినా ఈ ఇద్దరు మంత్రులు చేతకాని వారిలాగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు..వీళ్ల భరతం



పడతామ్.. విళ్ల చేతకాని తనాన్ని నిలదీస్తాం. జిల్లాలో మంత్రులు హెలికాప్టర్లలో తిరగడం తప్ప అభివృధి చేసింది ఎం లేదని అన్నారు. రైతు బంధును మూడు సార్లు ఎగ్గొట్టిన మోసగాడు ఈ సీఎం రేవంత్. నీళ్లు ఇవ్వకుండా, యూరియా లేక కరంట్ ఇవ్వకుండా పంటలను ఎండబెడుతున్నది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. రాహుల్ గాంధీకి, కేరళ ఎన్నికలకు మాత్రం వందల కోట్లు తెలంగాణ సొమ్మును తరలిస్తున్నారు..కాంగ్రెస్ అధిష్టానం కి తెలంగాణా ఏటీఎంలా మారింది. .కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు రైతులకు ఓ స్వర్ణయుగం..ఏ విషయం లో కూడా అన్నదాతలు ఇబ్బందులు పడలేదు.. కాంగ్రెస్ వచ్చింది వ్యవసాయం అస్తవ్యస్తంగా మారింది..ఆగం అయిందని అన్నారు.

వెలుతురు

cinema

# స్పీడ్‌గా ఎన్టీఆర్ డ్రాగన్ షూటింగ్

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఇటీవల జోర్డాన్‌లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ఇప్పుడు తదుపరి యాక్షన్ వేట కోసం సిద్ధమైంది. జోర్డాన్ షెడ్యూల్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించాడు ప్రశాంత్ నీల్. ఇక ఇప్పుడు నెక్స్ట్ షెడ్యూల్‌లో కూడా భారీ యాక్షన్ ఉండబోతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఇందుకోసం నగర శివార్లలోని ఒక ప్రముఖ స్టూడియోలో మూడు భారీ సెట్లను నిర్మించారట. ఇందులో విలన్ ఇంటికి సంబంధించిన సెట్ కూడా ఉందట. దాదాపు నెల రోజులకు పైగా సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఇక ఇక్కడ షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ కోసం శ్రీలంక వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అక్కడ కూడా యాక్షనే ఉంటుందని టాక్. మొత్తంగా చూసుకుంటే.. డ్రాగన్ యాక్షన్ షెడ్యూల్సే ఎక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రశాంత్ నీల్ ఏ రేంజ్ యాక్షన్ డోస్ ఇవ్వబోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ మరియు మలయాళ నటుడు టోవినో థామస్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. 'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో.. డ్రాగన్ పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి.




# ఉస్తాద్ ప్రచారంలో బిజీగా హరీష్ శంకర్

ప్రస్తుతం హరీశ్ శంకర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. దీనిప్రచారంలో భాగంగా దర్శకుడు వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ సినిమా ప్రీలుక్ పోస్టర్ విడుదలైనప్పుడు వచ్చిన రూమర్స్‌పై స్పందించారు. ప్రీలుక్ పోస్టర్‌లో హీరో వెనక నుంచి తీసిన ఫొటో ఉండటంతో అందులో ఉన్నది పవన్ కల్యాణ్ కాదు, హరీశ్ శంకరే స్వయంగా డూప్‌గా నటించారనే వార్తలు వైరల్ అయ్యాయి. టీజర్ విడుదలైన తర్వాత కూడా కొందరు ప్రేక్షకులు ఆయనే డూప్‌గా నటించారని అన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తాను పవన్ కల్యాణ్‌కు ఎప్పుడూ డూప్‌గా నటించలేదని స్పష్టం చేశారు. ఆ రూమర్లు చూసి తాను బాధ పడలేదని, పవన్‌తో తనను పోల్చడం, తాను ఒక స్టార్ హీరోలా కనిపిస్తున్నానని జనం అనుకోవడం తనకు సంతోషాన్నిచ్చిందని సరదాగా అన్నారు. చిత్ర పరిశ్రమలో బాడీ డూప్‌ను ఎందుకు ఉపయోగిస్తారనే విషయంపై కూడా హరీశ్ శంకర్ వివరణ ఇచ్చారు. షూటింగ్ సమయంలో హీరోలకు చిన్న గాయం తగిలినా షూటింగ్ షెడ్యూల్స్ మొత్తం అస్తవ్యస్తమవుతాయని, దీనివల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వస్తుందని ఆయన తెలిపారు. అందుకే హీరోల భద్రతను దృష్టిలోఉంచుకుని, రిస్క్ ఎక్కువగా ఉండే సన్నివేశాల్లోనే డూప్స్‌ను వాడతారని ఆయన వివరించారు.





# డిఫరెంట్‌గా దీవానా మూవీ టీజర్




టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'దీవాన'. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే 'దీవాన' గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు' మరియు 'అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా' వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు.ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 14న ఈ చిత్రం రాబోతుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ మూవీని డిస్ట్రిబ్యూషన్ చేస్తుం

# వృషకర్మ కోసం నాగచైతన్య కసరత్తులు

యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం హీరోగా తెరకెక్కుతున్న ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం వృషకర్మపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తుండగా, టాలెంటెడ్ దర్శకుడుకార్తీక్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృష కర్మ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని మేకర్స్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సినిమాలో నాగ చైతన్య పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. తాజాగా నాగ చైతన్య సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. ఆయన జిమ్‌లో తీసుకున్న ఒక ఫోటోను పోస్ట్ చేశాడు. ఆ ఫోటోలో చైతు 6 ప్యాక్ బాడీతో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. డంబెల్స్ పట్టుకుని వర్కౌట్ చేస్తున్న ఫోటో ద్వారా ఈ సినిమా కోసం ఎంత కష్టపడుతున్నాడో చూపించాడు. ఇటీవల వచ్చిన తండేల్ సినిమాలో నాగ చైతన్య డీ-గ్లామరస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే 'వృష కర్మ' కోసం మాత్రం పూర్తిగా స్టైలిష్ మరియు ఫిట్ లుక్‌లోకి మారడం విశేషంగా మారింది. నాగ చైతన్య ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. హీరో సుశాంత్ వంటి సెలబ్రిటీలు కూడా ఈ పోస్ట్‌పై స్పందించగా, వేలాది మంది అభిమానుల్గ ÷ర్ ఎమోజీలు, లైక్స్‌తో కామెంట్స్ సెక్షన్‌ను హోరెత్తించారు. ఇదిలా ఉండగా నాగ చైతన్య సెట్స్‌కి సంబంధించిన మరికొన్ని ఫోటోలు కూడా షేర్ చేశారు. షూటింగ్ లొకేషన్స్‌లో తీసిన ఈ చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వృష కర్మ' సినిమాపై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.



# తన భార్యపై ప్రశంసలు కురిపించిన అల్లు శిరీష్

టాలీవుడ్ హీరో అల్లు శిరీష్ తన వివాహం తర్వాత జీవితంలో చోటుచేసుకున్న మార్పులను, వేడుక విశేషాలను పంచుకున్నాడు. తన ప్రియురాలు నయనికను పెళ్లాడిన శిరీష్... వివాహానంతరం ఇచ్చిన మొదటి ఇంటర్వ్యూలో తన భార్యపై ప్రశంసల వర్షం కురిపించాడు. నయనిక చాలా తెలివైనదని, తన కుటుంబ సభ్యులతో చాలా త్వరగా కలిసిపోయిందని సంతోషం వ్యక్తం చేశాడు. గతంలో ఎక్కడికి వెళ్లినా తన ఒక్కడికే ఖర్చు పెట్టుకునేవాడినని, ఇప్పుడు ఇద్దరి బిల్లులు కట్టాల్సి ఉంటుందని సరదాగా వ్యాఖ్యానించాడు. పెళ్లి వేడుకలో తన సోదరుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పోషించిన పాత్ర గురించి శిరీష్ ప్రత్యేకంగా ప్రస్తావించాడు. ఇంత పెద్ద వేడుకలో చిన్నపాటి పొరపాట్లు జరగడం సహజమని, వాటిని పట్టించుకోకుండా ప్రతి క్షణాన్ని పూర్తిగా ఆస్వాదించాలని బన్నీ ఇచ్చిన సలహా తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. అల్లు అర్జున్ స్వయంగా పెళ్లి పనులన్నీ దగ్గరుండి పర్యవేక్షించాడని, వేడుక ముగిసే వరకు అక్కడే ఉండి అన్ని బాధ్యతలు నెరవేర్చాడని శిరీష్ గుర్తు చేసుకున్నాడు. అంతేకాకుండా, టాలీవుడ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల వివాహం కూడా తన పెళ్లికి కొన్ని రోజుల ముందే జరిగిందని... విజయ్ సొంత పనుల ఒత్తిడిలో ఉండి కూడా తన వివాహ వేడుకకు హాజరై తన స్నేహాన్ని చాటుకున్నారని తెలిపాడు.

# అక్షయ్ కుమార్ భూత్ బంగ్లా టీజర్ విడుదల

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ హారర్-కామెడీ చిత్రం 'భూత్ బంగ్లా'. సుమారు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'భూల్ భులైయా' వంటి క్లాసిక్ సినిమాను గుర్తు చేస్తూ, భయం మరియు నవ్వుల మేళవింపుతో ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మంగళపూర్ అనే గ్రామంలోని 'వధుసురుడు' అనే మిస్టరీ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా చిత్ర బృందం స్పష్టం చేసింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్‌తో పాటు టబు, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, వామిఖ గబ్బి, మిథిలా పాల్కర్ వంటి భారీ తారాగణం నటిస్తుండగా, ప్రీతమ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్‌గా విడుదల కాబోతుంది.




# ధురందర్-2 నుంచి ఆరి ఆరి పాట విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ కలయికలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రేజీ సీక్వెల్‌కు సంబంధించి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ఆరి ఆరి' సాంగ్‌ను చిత్రబృందంగురువారం విడుదల చేసింది. 2003 నాటి పాపులర్ బాంబే రాకర్స్ ÷ాటను శాశ్వత్ సచ్‌దేవ్ ఆధునిక బీట్స్‌తో రీమిక్స్ చేయగా, రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ పాట విజువల్స్ అదరగొడుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ 310 మిలియన్లకు పైగా వ్యూస్‌తో రికార్డులు సృష్టించగా, తాజాగా విడుదలైన ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత రెట్టింపు చేసింది. దాదాపు రూ.400 కోట్ల భారీ బ్జడెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ జస్కిరాత్ సింగ్ రంగీ మరియు హమ్జా అనే రెండు విభిన్న పాత్రల్లో ద్విపాత్రాభినయం చేయబోతున్నాడు. అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్ మాధవన్ వంటి అగ్ర నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం భారత గూఢచారి వ్యవస్థ చుట్టూ సాగే హై-వోల్టేజ్ డ్రామాగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా ఉగాది, ఈద్ పండుగల సందర్భంగా మార్చి 19, 2026న హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక మార్చి 18 సాయంత్రం నుంచే భారీ ఎత్తున పెయిడ్ ప్రివ్యూలు ప్రదర్శించనుండగా, అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటికే ఈ చిత్రం 'స్త్రీ 2' రికార్డులను అధిగమించి ఆల్-టైమ్ రికార్డ్ దిశగా దూసుకుపోతోంది.



## జిల్లాలో టెన్త్ పరీక్షలకు

# ఏర్పాట్లు పూర్తి

- అన్ని కేంద్రాలను సిద్ధం చేసిన అధికారులు



**వరంగల్, మార్చి12 ( వెలుతురు):**

వరంగల్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 13 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.ఈ నెల 14 లోగా విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసే పనిలో జిల్లా విద్యా శాఖ నిమగ్నమైంది. జిల్లాలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఇప్పటికే పలుదఫాలుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. అందుకు అనుగుణంగా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. ఈ ఏడాది జిల్లాలో 288 పాఠశాలల నుంచి మొత్తం 9,492 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పది ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉంచేం దుకు ఇప్పటికే ప్రణాళికబద్ధమైన పటిష్టమైన చర్యలను విద్యా శాఖ చేపట్టింది. స్పెషల్ క్లాసులు, రివిజన్ క్లాసులు, నిపుణులతో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తోంది. జిల్లాలోని 288 పాఠశాలల నుంచి 9,492 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 4,932 మంది బాలురు పరీక్షలకు హాజరు కానుండగా 4560 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో అన్ని వసతులతో కూడిన 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 47 మంది సీఎస్, 48 మంది డీవోలను, 47మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రాల బట్వాడ కోసం ఆరుగురు రూట్ ఆఫీసర్లు, మరో ఆరుగురు అదనపు రూట్ ఆఫీసర్లను నియమించారు. ముగ్గురు సభ్యులతో కూడిన మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, 496 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇక 22 పరీక్షా కేంద్రాల్లో శాశ్వత సీసీ కెమెరాలు ఉండగా, మిగిలిన 25 కేంద్రాల్లో తాత్కాలిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచి రాష్ట్ర స్థాయిలోనే జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పరీక్షలకు అనుమతిస్తారని, హెడ్మాస్టర్ల సంతకాలతో అవసరం లేదని డీఈవో రంగయ్య స్పష్టం చేశారు. వరంగల్ జిల్లాను పదవ తరగతి ఫలితాల్లో ముందంజలో ఉంచుతామని అన్నారు. ప్రత్యేకమైన ప్రణాళికతో విద్యార్థులను పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం చేసామని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు హాజరు కావాలన్నారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మరింత వేడెక్కిస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. రాయలసీమ, గోదావరి జిల్లాల్లో ఎండలు తీవ్రం అవుతున్నాయి. తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరంలో కూడా ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి భగభగలతో నగర ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే.. ముందు ముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, బయటికి రాకుండా చూసుకోవాలి. రోజుకు తప్పని సరిగా నాలుగు లీటర్ల నీరు తాగితే డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా పలుచని నూలు వస్త్రాలు ధరింపజేయాలి.ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అతి ముఖ్యమైన పని ఉంటేనే బయటకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండల నుంచి రక్షణ పొందేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలి వైద్యులు సూచిస్తున్నారు. ఈ ఎండాకాలంలో మనుషులతో పాటు, పశవులకు కూడా ఆరోగ్య చర్యలు అవసరమని సూచిస్తున్నారు. ఎండను తాళలేక కొందరు ఎక్కువ సార్లు స్నానం చేయడం మంచిది కాదు. శరీరం బలహీనపడుతుంది. ఒక్కోసారి శరీరం ఉష్ణోగ్రతలు ఉండాల్సిన దానికంటే దిగువకు పడిపోతాయి. దీంతో స్పృహకోల్పోవడం, ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డీహైడ్రేషన్‌కు గురికుండా ఉండేందుకు ఎక్కువ సార్లు నీరు తాగాలి. బయటకు వెళ్లేవారు వెంట మంచి నీరు తీసుకెళ్లాలంటున్నారు. దాహార్తిని తీర్చేందుకు పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, శీతల పానీయాలు తాగడం ఆరోగ్యానికి మంచిది. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ముఖ్యమైన పనులపై బయటికి వెళ్లేవారు తప్పని సరిగా తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వేసుకొని వెళ్లాలని, పాదరక్షలు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# హైకోర్టు ఆదేశాలను అమలు చేయండి


- పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి
- కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

**కర్నూలు,మార్చి12( వెలుతురు):**

మెడికల్ అండ్ హెల్త్ శాఖలో హైకోర్టు ఆదేశాలను తక్షణం అమలు చేసి అక్రమంగా తొలగించిన పారిశుద్ధ్య కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. పద్మావతి ఫెర్టిలిటీ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం సిఐటియు కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, కెవిపిఎస్ నగర అధ్యక్షుడు రమణ మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ కళాశాలలో హాస్టల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారన్నారు. మహిళ కార్మికులను 50 సంవత్సరాలు పైబడిన నేపథ్యంతో తొలగించడం దుర్మార్గమన్నారు. అనంతపురం, కడప , తిరుపతి, నంద్యాల ఆస్పత్రిలో పనిచేసేటువంటి పారిశుధ్య కార్మికులను తొలగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 62 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ వయసు ఉందన్నారు. పారిశుధ్య కార్మికులను మాత్రం 50 సంవత్సరాల పేరుతో తొలగించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. రాష్ట్రంలోని ఇతర జోన్లలో ఈ సమస్య లేకపోయినా రాయలసీమ జోన్‌లో మాత్రమే ఉండటం అనుమానాలకు తావిస్తున్నదన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ అధికారులు వాటిని అమలు చేయకపోవడం తగదన్నారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

- హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం
- ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత
- ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి
- బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు




**హైదరాబాద్,మార్చి12( వెలుతురు):**

వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్య దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఓవైపు గ్యాస్ కొరతతో నగరంలోని పలు హోటళ్లను తాత్కాలికంగా మూసేస్తుంటే, మరోవైపు హాస్టళ్ల నిర్వహణపై యజమానులు మల్లగుల్లాలుపడుతున్నారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా బుధవారం నుంచి నగరంలో దాదాపుగా ఆగిపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది.గ్యాస్ వినియోగం ఎక్కువ అయ్యే దోసె, పూరీ, చపాతీ వంటకాలను తాత్కాలికంగా అన్ని హాస్టళ్లలో నిలిపివేసినట్లు సమాచారం. గ్యాస్ కొరత తీరేవరకు అన్నం, సాంబారు, కూరతో సాధారణ భోజనాన్ని మాత్రమే అందించగలమని ఐటీకారిడార్‌లోని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. చికెన్, కోడిగుడ్డుకూర, వేపుళ్లు వంటి అదనపు వంటలను నిలుపుదలచేస్తున్నట్లు తెలిపారు. టీ, కాఫీ లాంటివాటిని అందించలేమని వెల్లడిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో మూడు, నాలుగు రోజులుగా సిలిండర్ల బుకింగ్ కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. సర్వర్ డౌన్‌తో బుకింగ్ కావడం లేదంటున్నారు. వాట్సాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉన్నా కావడం లేదంటున్నారు.ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బావర్చి హోటల్‌ను బుధవారం మూసేశారు. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగానే మూసేసిన్నట్లుగా తెలిసింది. ప్రముఖ ప్యారడైజ్ హోటల్స్ అన్ని బ్రాంచీలలో టీ అమ్మకాలను నిలిపివేశారు. ఐటీసీ సంస్థ కూడా వివిధ ప్రాంతాల్లో గల సంస్థ హోటల్స్‌లో గ్యాస్ కొరత కారణంగా లంచ్, డిన్నర్ ఉండదని ప్రకటించింది. ఒకవేళ దొరికినా కొన్ని ప్రాంతాల్లో రూ. 4 వేలకు, మరికొన్ని ప్రాంతాల్లో రూ. 3,500కు విక్రయిస్తున్నారు. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర సాధారణంగా రూ.2105ల వరకు ఉంది. బుధవారం నుంచి కమర్షియల్ సిలిండర్ల సరఫరా పూర్తిగా బంద్ అయింది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో కూడా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోవడం, మార్కెట్‌లో అధిక ధర ఉండడంతో కొనుగోలు చేయలేక పలు హోటల్స్ మూత పడుతున్నాయి. సిలిండర్ కొరతతో హోటల్స్ మూసేస్తున్నట్లు యజమానులు ప్రకటించారు. అవసరమైతే అవసరమైతే కట్టెల పొయ్యి మీద వంట చేస్తామని చెప్పారు. ఇక పలు ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్‌లో కమర్షియల్ సిలిండర్ సరఫరా లేకపోవడంతో హోటల్ మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టిఫిన్ సెంటర్ బందు చేసుకోవాల్సి వస్తదేమోనని ఆందోళన చెందారు. అఫ్జల్‌గంజ్, బేగంబజార్‌లో కొన్ని టిఫిన్ సెంటర్లలో గ్యాస్ లేకపోవడంతో మూసేస్తున్నారు. వేల రూపాయలు పెట్టి సిలిండర్ కొనుగోలు చేసి వ్యాపారం ఎలా చేస్తామని చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు మూతపడ్డాయి. పలు ప్రాంతాల్లో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో టీ షాపులు, బండి వ్యాపారులు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారు. కొందరూ గృహ వినియోగదారులు 14కిలోల గ్యాస్ సిలిండర్‌ను రూ.1800ల వరకు అమ్ముతున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో హోటళ్లు మూతపడుతున్నాయి. గృహావసరాల సిలిండర్ల సరఫరా తగ్గింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే రూ.5 భోజనానికి ఇబ్బంది ఉండదని జీహెచ్‌ఎంసీ వర్గాలు చెబుతున్నాయి.విద్యుత్‌తో నడిచే యంత్రాలతో భోజనం తయారు చేస్తున్న దృష్ట్యా గ్యాస్ కొరత ప్రభావం తయారీపై ఉండబోదని జీహెచ్‌ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. సిలిండర్లకు ప్రత్యామ్నాయ మర్గాలను నిర్వాహకులు అన్వేషిస్తున్నారని అమీర్‌పేట హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు చెబుతున్నారు. బుధవారం అమీర్‌పేట ప్రాంతంలోని హాస్టల్ నిర్వాహకులు 120కుపైగా ఎలక్ట్రికల్ స్టౌలు కొనుగోలు చేసినట్లు సమాచారం. కొందరు కట్టెల పొయ్యి ఏర్పాటుచేసుకున్నారని దుర్గానగర్ హాస్టళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ చెప్పారు. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టళ్ల యజమానులంతా ఒక్కటయ్యారు. నిర్వహణ విషయంలో తాత్కాలిక నిబంధనలు రూపొందించి అమలుచేస్తున్నారు. విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం నగరానికి వచ్చిన యువతకు ఆశ్రయమిచ్చే పేయింగ్ గెస్ట్ హాస్టళ్ల నిర్వహణ ఇప్పుడు మరింత భారంగా మారింది. మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కోర్సులు నేర్చుకోడానికి వచ్చే విద్యార్థుల సంఖ్య ఏడాదిగా బాగా తగ్గింది. దాంతో ప్రైవేటు హాస్టళ్ల వ్యాపారం మందకొండిగా నడుస్తోంది. గ్యాస్ కొరత మమ్మల్ని మరింత నష్టాల్లోకి నెడుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నాం. హాస్టల్‌లో ఉంటున్నవారికి అన్నం, కూర, సాంబారైనా వడ్డించడానికి ప్రత్నిస్తున్నాం అంటున్నారు.

# నిజామాబాద్ జిల్లాలో దారుణ హత్య

- కాంగ్రెస్ నేతను హతమార్చిన సమీప బంధువు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు




**నిజామాబాద్,మార్చి12 ( వెలుతురు):**

నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఇందల్వాయి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపీ గురువారం దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. కుటుంబ రాజకీయ విభేదాలు ఈ హత్యకు కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామస్థాయి రాజకీయాల్లో పెరిగిన విభేదాలు చివరకు రక్తపాతం వరకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్‌లో కీలక నేతగా గుర్తింపు పొందిన ఇమ్మడి గోపీపై ఆయనకు బంధువైన సతీశ్ దాడి చేశాడు. ముందుగా కారుతో గుద్ది, అనంతరం కత్తితో దాడి చేసి గోపీని హత్య చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ దాడిలో తీవ్ర గాయాల కారణంగా గోపీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతరం సతీశ్ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. సతీశ్, ఇమ్మడి గోపీకి వరుసకు మేనల్లుడు. ఒకే కుటుంబానికి చెందిన వారైనా, గ్రామ రాజకీయాల్లో ఏర్పడిన విభేదాలు వారిద్దరి మధ్య తీవ్ర శత్రుత్వంగా మారాయి. గ్రామంలో రాజకీయంగా ఇద్దరూ ప్రభావం చూపే స్థాయిలో ఉండటంతో, కాలక్రమేణా వీరి మధ్య విభేదాలు పెరిగాయి. ముఖ్యంగా గ్రామ సర్పంచ్ ఎన్నికల తర్వాత ఈ విభేదాలు మరింత తీవ్రమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గౌరవరం గ్రామంలో సర్పంచ్ పదవికి ఇమ్మడి గోపీ భార్య పోటీ చేసి విజయం సాధించారు. అదే ఎన్నికల్లో సతీశ్ భార్య కూడా సర్పంచ్ పదవికి పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన భార్య ఓడిపోయారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య రాజకీయంగా తీవ్రమైన విభేదాలు మొదలయ్యాయి. గ్రామ రాజకీయాల్లో ఆధిపత్యం కోసం ఇరువర్గాల మధ్య తరచూ గొడవలు జరిగేవని తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. చిన్న చిన్న విషయాలపై కూడా ఇరువర్గాల మధ్య తగాదాలు జరిగేవని సమాచారం. ఇమ్మడి గోపీ హత్యతో గౌరవరం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటన తెలిసిన వెంటనే గ్రామానికి పెద్దఎత్తున పోలీసులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో భద్రతను పెంచారు. స్థానికంగా గోపీ కీలక నాయకుడిగా గుర్తింపు పొందారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గోపీ మరణంతో గ్రామ ప్రజలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. హత్య చేసిన తర్వాత సతీశ్ పోలీసులకు లొంగిపోయాడు. ఆ తర్వాత అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హత్యకు అసలు కారణాలు ఏమిటి..?, ముందుగా ప్రణాళికతోనే గోపీని హత్య చేశాడా..? అనే పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమికంగా చూస్తే కుటుంబ రాజకీయ విభేదాలే ఈ హత్యకు ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నారు. అయితే పూర్తి వివరాలు దర్యాప్తు తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది.

# న్యాయవ్యవస్థలో అవినీతి రచయితలు

- వారిని దూరంపెట్టాలన్న సుప్రీం ధర్మాసనం




**న్యూఢిల్లీ,మార్చి12( వెలుతురు):**

జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని చేర్చేందుకు కారకులైన వారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ముగ్గురు నిపుణులతో ఇకపై ఎలాంటి సంబంధాలు కొనసాగించొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో నెలకొన్న అవినీతి గురించి వివాదాస్పద అంశంగా పాఠ్యపుస్తకంలో చేర్చడంపై ఎన్‌సీఈఆర్‌టీ.. సర్వోన్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పడంతో పాటు ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ వివాదాస్పద పాఠ్యాంశాన్ని ప్రొ.మైఖేల్ డానినో సహా టెక్స్ట్‌బుక్ డెవలప్‌మెంట్ టీమ్ సభ్యులు సువర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లు రూపొందించారని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. 'ప్రొ.మైఖేల్ డానినో, ఆయన సహచరులు సువర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లకు భారత న్యాయవ్యవస్థను గురించిన సరైన పరిజ్ఞానం లేకుండా ఉండాలి, లేదా విద్యార్థుల ముందు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను వక్రీకరించి తప్పుగానైనా చూపించి ఉండాలి' అని పేర్కొంది. ఇకపై రాబోయే తరం విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల రూపకల్పన పక్రియలో ఆ ముగ్గురి ప్రమేయం ఉండకూడదని, వారిని తక్షణమే పక్కనపెట్టాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ నిధులతో పూర్తిగా లేదా పాక్షికంగా సంబంధమున్న ఎలాంటి బాధ్యతలనూ అప్పగించకూడదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయవ్యవస్థ గురించి విద్యార్థులకు బోధించడం మంచి విషయమే అయినప్పటికీ.. సంబంధిత పాఠ్య ప్రణాళిక తయారీలో కనీసం ఒక్క న్యాయ నిపుణుడికీ అవకాశం కల్పించకపోవడం తమకు అసంతృప్తి కలిగిస్తోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్ఈసీఆర్‌టీ లీగల్ స్టడీస్‌కు సంబంధించి పాఠ్యప్రణాళిక రూపకల్పనలో న్యాయ రంగానికి చెందిన నిపుణులతో వారం రోజుల్లోగా ఓ కమిటీని ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కమిటీలో మాజీ సీనియర్ న్యాయమూర్తి, ఓ ప్రసిద్ధ న్యాయవాది సహా ప్రముఖ విద్యావేత్త ఒకరుంటే బాగుంటుందని అభిప్రాయపడింది. వీరు నేషనల్ జ్యుడీషియల్ అకాడమీతో సంబంధం ఉన్నవారైతే మరింత మంచి విషయాన్ని పొందుపరిచేందుకు అవకాశముంటుందని తెలిపింది. వివాదాస్పద ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాన్ని పూర్తిగా నిషేధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 26న తీర్పు వెలువరించగా.. దానిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరిగినట్లు ధర్మాసనం గుర్తుచేసింది. ఈ ప్రచారం వెనుక ఉన్న సామాజిక మాధ్యమ వేదికలు, వ్యక్తుల వివరాలను తమకు అందజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కోర్టు తీర్పులను వక్రీకరిస్తూ ఇష్టానురీతిన వ్యాఖ్యలు చేసేవారి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేసింది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com